నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
మంగళవారం | మే 21, 2024 | www.navatelangana.com

హాశిష్ మత్తు మందు స్మగ్లర్ అరెస్టు

నవతెలంగాణ-వరంగల్

అతి ప్రమాదకమైన హశిష్ మత్తు మందు స్మగ్లింగ్‌కు పాల్ప డుతున్న అంతర్రాష్ట్ర స్మగ్లర్‌ను మట్టెవాడ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నిందితుడు నుంచి సుమారు రూ.4.50లక్షలు విలువైన 900గ్రాముల గంజాయి ఆకుతో తయారు చేసిన హశిష్ మత్తు పదార్థాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ వివరాలు వెల్లడించారు. అంతర్ రాష్ట్ర స్మగ్లర్ కాకినాడ జిల్లా ఏశేశ్వరం ఎర్రవరంకు చెందిన చింతల వెంకట రాజు అలియాస్ బాబీ ప్రభుత్వ నిషేధిత మత్తు పదార్థంతో హంటర్ రోడ్‌లోని ఏడుమోరీల ప్రాంతంలో అనుమానస్పదంగా తిరుగుతున్నట్లుగా పోలీసులకు సమాచారం రావడంతో మట్టెవాడ పోలీసులు తెలంగాణ నార్కోటిక్ అనాలాసిస్ విభాగం అధికారులతో కలిసి మత్తు పదార్థంను విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న నిందితుడిని అదుపులోకి తీసుకోని తనిఖీ చేశారు. దీంతో నిందితుడి వద్ద నిషేధిత మత్తు పదార్థం హశిష్ గుర్తించిన పోలీసులు పంచుల సమక్షంలో మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేశామని ఏసీపీ తెలిపారు.



మలేరియా సిబ్బంది ఖాతాలో వేతనాలు జమ

నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-వరంగల్

'వేతనాలు అందక మలేరియా సిబ్బంది వెతలు' అనే కథనం ఇటీవల 'నవతెలంగాణ' దినపత్రికలో వెలువడిన విషయం విదితమే. ఈ కథనానికి స్పందించిన అధికారులు వరంగల్ మహనగర పాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 90మంది మలేరియా సిబ్బంది ఖాతాలో వేతనాలను జమ చేశారు. దీంతో సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. కార్మికుల పాక్షపాతిగా ఉన్న నవతెలంగాణ దినపత్రికకు కతజ్ఞతలు తెలిపారు.

నాలా పూడికతీత పనులలో వేగం పెంచాలి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

నవతెలంగాణ-వరంగల్



నాలా పూడికతీత పనులలో వేగం పెంచాలని బల్ది యా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. సోమ వారం వరంగల్ పరిధి లోని బొంది వాగు నాలా దేశాయిపేట 80ఫీట్ల రోడ్డు, లేబర్ అడ్డా, డాక్టర్స్ కాలనీ,కెనాల్ యూటీ ప్రాంతం దేశాయిపేట, వడ్డేపల్లి చెరువు, బాలాజీ నగర్ జంక్షన్ ప్రాంతాల్లో కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి నాలాల స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలం నేపథ్యంలో పూడిక తీత పనుల్లో వేగం పెంచాలన్నారు. ఆయా సిల్ట్‌ను రాంపూర్‌డంప్ యార్డుకు తరలించాలని సూచించారు. లేకుంటే వర్షాలు కురిసే క్రమంలో సిల్ట్ తిరిగి అందులో కలిసే అవకాశం ఉందన్నారు. శానిటేషన్ సిబ్బందితో సమన్వయం చేసుకొని ఎప్పటికపుడు సిల్ట్ తరలింపు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ కష్ణారావు, సిఎంహెచ్ఓ డా. రాజేష్, ఈఈ శ్రీనివాస్, డీఈలు రంగారావు, సారంగం, రవికిరణ్, ఏఈ సతీష్, శానిటరీ ఇన్స్పెక్టర్ ఇస్రం శ్రీను పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్

నవతెలంగాణ-నెక్కొండ

రైతులకు విక్రయించే విత్తనాలను నాణ్యమైన కంపెనీలకు సంబంధించినవే ఇవ్వాలని నకిలీ, గడువుదీరిన విత్తనాలను విక్రయిస్తే వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని సీఐ ఎస్ చంద్రమోహన్ హెచ్చరించారు. నెక్కొండలోని రైతు వేదికలో సోమవారం మండల వ్యవసాయ అధికారి నాగరాజు అధ్యక్షతన మండ లంలోని డీలర్లకు, విత్తన వ్యాపారులకు సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ రైతుకు అండగా నిలువాలని, రైతులను మోసం చేయాలని యత్నిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తామన్నారు. అనంతరం ఏవో నాగరాజు మాట్లాడుతూ ప్రతి నెలా రైతులకు విక్రయించే విత్తనాలను నెల చివరలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ఫాం-డీని నిల్వల వివరాలను వ్యవసాయ కార్యాలయంలో సమర్పించాలన్నారు. బీటీ 3విత్తనాలకు అనుమతి లేకపోవడంతో ఎలాంటి నిల్వ, విక్రయాలు చేపట్టొద్దని సూచించారు. విత్తనాల నిల్వలను, స్టాక్ బోర్డులను రైతులకు కనిపించేలా ప్రదర్శించాలని, బోర్డుపై నిల్వలతో పాటు ధరల పట్టికను ప్రతి దుకాణంలో ప్రదర్శించాలన్నారు. రైతులకు విక్రయించిన విత్తనాల, ఎరువులకు బిల్లులు చెల్లించాలని, ప్రతిబిల్లుపై రైతు సంతకం తీసుకోవాలన్నారు. ఎరువులకు సంబంధించి స్టాకు బోర్డు,ధరల పటికా తప్పని సరిగా కనబడనట్లుగా ప్రదర్శించాలని, విధిగా ఈ-పాస్ మిషన్ ద్వారా ఎరువులను రైతులకు విక్రయించాలని సూచించారు. బలవంతంగా రైతులకు విత్తనాలు, ఎరువులతో ఇతర కంపెనీల ప్రోడక్టులను విక్రయించరాదన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు, డీలర్లు పాల్గొన్నారు.



సబ్సిడీపై జీలుగా విత్తనాలు విక్రయం

తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై అందించే జీలుగు విత్తనాలు నెక్కొండలోని ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం లో అందుబాటులోకి మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. జీలుగు విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్కు జిరాక్స్‌లను వెంట తెచ్చుకుని 30 కిలోల పరిమాణం బస్తా రూ.1116 చెల్లించి తీసుకువెళ్లాలన్నారు.

శివాలయంలో క్రికెటర్ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-పర్వతగిరి

మండల కేంద్రంలోని శ్రీ పర్వతాల శివాలయంలో సోమవారం ప్రముఖ క్రికెట్ రంజీ ప్లేయర్ నాగేందర్ ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ కార్య క్రమంలో ఆయన వెంట ఎంపీడీవో మాలోతు శంకర్‌నాయక్, పర్వతగిరి పంచాయతీ కార్యదర్శి రఘు, పర్వతగిరి ఎంపీటీసీ మాడుగుల రాజు తదితరులు పాల్గొన్నారు.





ముదిరాజ్‌లకు స్థానిక సంస్థల్లో ప్రాధాన్యత ఇవ్వాలి

నవతెలంగాణ-నర్సంపేట

స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లకు రాజకీయ పార్టీలు తగిన ప్రాధన్య ఇవ్వాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) డివిజన్ అధ్యక్షులు పెండ్యాల యాదగిరి కోరారు. సోమవారం పట్టణంలోని మెపా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో యాదగిరి మాట్లాడుతూ ముదిరాజ్‌లు అత్యధిక జనాభా కలిగి ఉన్నా అన్ని రంగల్లో ప్రాధన్యత లేక వెనుకబడ్డారన్నారు. బీసీలలో ముదిరాజ్‌ల జనాభాకు అనుగుణంగా రాబోయే గ్రామ పంచాయతీ, మండల, జిల్లా ప్రజాపరిషత్, మున్సిపల్ ఎన్నికలల్లో రాజకీయ పార్టీలు సముచితమైన ప్రాధన్యతనివ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మెపా జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నిమ్మనబోయిన అశోక్, మెపా డివిజన్ గౌరవ అధ్యక్షులు పిట్టల కుమార్, దోని చేరాలు, బుసాని రమేస్, నేదురు రాజేందర్, మోటం రవి, నాయిని వేణు, రాజమౌళి, ఓరుగంటి కుమారస్వామి పాల్గొన్నారు.

'టెట్'పై అయోమయం..

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులున్నా..

గందరగోళం మధ్యనే ఆన్‌లైన్ పరీక్షలు

నేటి నుంచి షురూ..

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

'టెట్' పరీక్ష ఎవరు రాయాలి ? ఎవరు రాయకూడదు ? అనే విషయాలపై ఉపాధ్యాయుల్లోనే స్పష్టత కొరవడింది. మే మాసంలో ఈ వివాదంపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. 2010కి ముందు టీచర్లుగా నియమితులైన పిటిషనర్లకు ఇప్పుడు 'టెట్' రాయాల్సిన అవసరం లేదని ఉత్తర్వులిచ్చిందని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. 2009 నుండి 'టెట్'ను రాష్ట్ర విద్యా శాఖ నిర్వహిస్తుంది. తాజాగా 'టెట్' క్వాలిఫై అయితేనే పదోన్నతులు పొందడానికి అర్హులని నియమ, నిబంధనలు పెట్టడంతో టీచర్లు పెద్ద ఎత్తున 'టెట్' ఆన్‌లైన్ పరీక్ష రాయడానికి దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రంలో 'టెట్' పేపర్ 1కు 99 వేల మంది, పేపర్ 2 రాయడానికి 1లక్షా 86 వేల మంది దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. 'టెట్'ను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటి)గా నిర్వహిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎప్పుడో ఉపాధ్యాయులుగా నియమితులైన వారికి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌పై సరైన అవగాహన లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం నుండి ఈ ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జూన్ 3వ తేదీ వరకు ఈ పరీక్షలను నిర్వహిస్తున్నారు.



ఉమ్మడి వరంగల్ జిల్లాలో 'టెట్ ఆన్‌లైన్ పరీక్షలు రాస్తున్న ఉపాధ్యాయులు నేటికీ అయోమయంలోనే సన్నద్ధ మవుతున్నారు. 'టెట్' క్వాలిఫై అయితేనే పదోన్నతులకు అర్హులన్న నిబంధనతో ఇన్‌సర్వీస్ టీచర్లు పెద్ద సంఖ్యలో ఈ పరీక్షలను రాస్తున్నారు. ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, గ్రేడ్ 2 హెచ్ఎం పదోన్నతులకు 'టెట్' నుండి మినహా యింపునిచ్చారు. మిగతా పదోన్నతులకు మాత్రం 'టెట్' విధిగా క్వాలిఫై కావాల్సిందేనని నిబంధన విధించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 2.85 లక్షల మంది అభ్యర్థులు 'టెట్' రాస్తుండగా, ఇందులో ఇన్‌సర్వీస్ టీచర్లు 48 వేల మంది వుండడం గమనార్హం. 'టెట్' పరీక్షలు మంగళవారం నుండి ప్రారంభం కానున్నాయి. ఉదయం 7.30 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ప్రచారం చేయడంతో ఈ మేరకు ఉపాధ్యాయులు సకాలంలో చేరుకోవడానికి వాహనాలను సమకూర్చుకుంటున్నారు. ఇది ఉపాధ్యాయులకు వ్యయ ప్రయాసాలకు గురిచేస్తుంది. 'టెట్' మొదటి పేపర్ ఉదయం 9.00 గంటల నుండి 11.30 గంటల వరకు నిర్వహించనున్నారు. పేపర్ 2 పరీక్ష మధ్యాహ్నం 2.00 గంటల నుండి 4.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుంది. ఈ పరీక్ష 2.30 గంటలపాటు నిర్వహించ నున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారుగా 2.85 లక్షల మంది ఈ పరీక్షలను రాయనున్నారు. ఇందులో సుమారు 48 వేల మంది ఇన్‌సర్వీస్ టీచర్లుండడం గమనార్హం.

హైకోర్టు ఏమి చెప్పింది..?

'టెట్' పరీక్షను రాష్ట్రంలో 2009 నుండి నిర్వ హిస్తున్నారు. డిఎస్సీ రాసే అభ్యర్థులకు ముందుగా 'టెట్' నిర్వ హించి, ఈ పరీక్షలో క్వాలిఫై అయితేనే డిఎస్సీకి అర్హులనే నిబంధన పెట్టారు. తాజాగా ఉపాధ్యా యు లందరూ పదోన్నతుల కోసం 'టెట్ క్వాలిఫై కావాల్సిందేనన్న నిబంధన విధించడంతో తాజాగా జరుగుతున్న 'టెట్' ఆన్‌లైన్ పరీక్షకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. 'టెట్' తాజా ఉత్తర్వులపై పలువురు ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించారు. 2009 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులకు 'టెట్' ఎలా వర్తింస్తుందని చాలెంజ్ చేశారు. ఈ క్రమంలో హైకోర్టు 2010 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులకు (పిటిషనర్లు) 'టెట్' అవసరం లేదని మధ్యంతర ఉత్తర్వులను ఇచ్చింది. హైకోర్టులో వున్న ఈ కేసులో మిగతా ఉపా ధ్యాయులు ఇంప్లీడ్ అయితే 'టెట్' రాయాల్సిన అవ సరముండకపోయేది. ఇంప్లీడ్ కాని ఉపాధ్యా యులందరూ ఈసారి 'టెట్' రాయడానికి రూ.1000 చెల్లించి మరీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. హైకోర్టు ఈ వివాదంపై తుది తీర్పును ఇవ్వాల్సి వుంది.

ఆన్‌లైన్‌పై అయోమయం..

'టెట్' పరీక్షను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (ఆన్‌లైన్ పరీక్ష)గా నిర్వహిస్తుండడం కూడా ఉపాధ్యాయుల్లో గందరగోళానికి కారణమైంది. ఈ విషయంలో ఉపాధ్యాయ సంఘాలు విజ్ఞప్తి చేసిన పాఠశాల విద్యా శాఖ పట్టించుకోకపోవడంపై ఉపాధ్యాయుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుంది. ఏదేమైనా గందరగోళం మధ్యనే 'టెట్' నిర్వహించడానికి రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ ఏర్పాట్లు చేసింది.

దూర ప్రాంతాల్లోనే పరీక్షా కేంద్రాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అభ్యర్థులు మొదటి, రెండో ఆప్షన్‌లలో కోరుకున్న పరీక్షా కేంద్రాలను వదిలి, ఇతర జిల్లాల్లో పరీక్షా కేంద్రాలను కేటాయించారు. మొత్తం 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. స్థానిక జిల్లా కాకుండా దూర ప్రాంతాల్లోని పరీక్షా కేంద్రాలను కేటాయించడంతో అభ్యర్థులు తీవ్ర వ్యయప్రయాసాలకు గురవుతున్నారు. వరంగల్, హన్మకొండ, ములుగు, జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల అభ్యర్థులకు వరంగల్ కాకుండా, హైద్రాబాద్, ఖమ్మం, పెద్దపల్లి, కరీంనగర్ పరీక్షా కేంద్రాలను కేటాయించడం ఇబ్బందికరంగా మారింది.

గందరగోళంగా నిర్వహణ : పెండెం రాజు, టీఎస్‌యుటిఎఫ్ హన్మకొండ జిల్లా కార్యదర్శి



2010కి ముందు నియమితులైన ఉపా ధ్యాయులకు 'టెట్' నుండి మినహాయింపును ఇస్తూ హైకోర్టు మధ్యంతర ఉత ్తర్వులిచ్చింది. అయితే ఇది కేవలం పిటిషనర్లకు మా త్రమే వర్తిస్తుండడంతో ఇ ప్పుడు, పదోన్నతులకు సైతం 'టెట్' క్వాలిఫై వుండాలన్న నిబంధన పెట్టడంతో ఇన్ సర్వీస్ టీచర్లు పెద్ద సంఖ్యలో పరీక్షలు రాస్తున్నారు. 'టెట్' ఆన్‌లైన్ పరీక్షను గందరగోళంగానే నిర్వ హిస్తున్నారు. ఎవరైనా తమకు దగ్గరున్న పరీక్షా కేంద్రాలనే ఎంచుకుంటారు. ఇందుకు భిన్నంగా అభ్యర్థులు సూచించిన మొదటి, రెండో పరీక్షా కేంద్రాలను కాదని ఎక్కడో దూరంగా వున్న పరీక్షా కేంద్రాలను కేటాయించడం అభ్యర్థులకు పెనుభారంగా పరిణమించింది.

హైవేపై జాడే లేని హెచ్చరిక బోర్డులు

సామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాటం

-నిద్రావస్థలో నేషనల్ హైవే అధికారులు

-ప్రమాదాలకు నిలయం బుధరావుపేట

-హైవే ఎక్కాలంటే జంకుతున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఖానాపురం

నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్య వైఖరికి మండ లంలోని బుధరావుపేట గ్రామం ప్రమా దాలకు అడ్డాగా మారింది. నేషనల్ హైవే పై హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో సామాన్య ప్రజలకు దినదిన గండంగా మారింది. గత ఆరు నెలల్లో మూడు ప్రమాదాలు కాగా అందులో కొంతమంది ప్రాణాలు కోల్పోయారు. మరి కొంతమంది ఆస్పత్రిల పాలై అవయవాలు కోల్పోయి జీవితాన్ని కొనసా గిస్తున్నారు. ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలు రోడ్డున పడ్డాయి. మండలంలో నర్సంపేట నుండి మహబూబాబాద్‌కు వెళ్లే నేషనల్ హైవే 365రోడ్డుపై ఎలాంటి సూచికలు కాని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. హైవేపై వాహనదారుల రద్దీ ఎక్కువగా ఉండడంతో పాటు వాహనదారులు పరిమితిని మించి స్పీడుతో ప్రయాణిస్తున్నారు. ఇదే క్రమంలో రోడ్డు దాటుతున్న వారు పాదాచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. బుధరావుపేట గ్రామం ఆరంభం మొదలు చివరి వరకు స్పీడ్ బ్రేకర్లు కానీ హెచ్చరిక బోర్డులు గానీ నేషనల్ హైవే అధికారులు ఏర్పాటు చేయలేదు. పలు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ గ్రామస్తులు పలుమార్లు అధికారులను వేడుకున్నప్పటికీ స్పందించకపోగా నిద్రవస్థను వీడి పరిష్కార మార్గాలను చేపట్టకపోవడం విడ్డూరంగా మారింది. నేషనల్ హైవే ఇరుపక్కన ఉన్న కుటుంబాలు రోడ్డు ఎక్కాలంటే జంకుతన్నారు. గ్రామస్తులు వాహనాలు వెళ్లే స్పీడు చూసి ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని జీవనాన్ని కొనసాగిస్తున్నారు. మరికొన్ని కుటుంబాలు రోడ్డుమీది పడకముందే నేషనల్ హైవే అధికారులు వెంటనే స్పందించి హైవేపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదాలు అరికట్టాలి : షేక్ యాకుబ్‌పాషా (గ్రామస్తుడు)



గ్రామంలో నేషనల్ హైవేపై పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. హైవే అధికారులకు చాలాసార్లు సమాచార అందించి ప్రమాదాలు అరికట్టే దిశగా చర్యలు చేపట్టాలని కోరాం. కానీ ఇంతవరకు పరిష్కార చర్యలు చేపట్టలేదు. వెంటనే స్పందించి గ్రామంలో స్పీడ్ బ్రేకర్లతో పాటు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. వాహనదారులు పరిమితిలో డ్రైవింగ్ చేసేలా హెచ్చరిక బోర్డులపై పొందుపరచి ప్రమాదాలను అరికట్టాలి.

స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలి : గంద్రాతి సాయి (గ్రామస్తుడు)



హైవే పక్కన ఉన్న నివాసాలలోని చిన్నపిల్లలు హైవేపైకి ఎక్కుతున్నారు. పరిమితి మించి స్పీడ్‌తో వస్తున్న వాహన దారులు పిల్లలను, పాదా చారులను, ప్రజలను ఢీ కొడితే అక్కడి కక్కడే ప్రా ణాలు కోల్పోయే అవకాశాలు ఉన్నా యి. ఇటీవల గ్రామ స్తులు పలు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయారు. నర్సంపేట, మహ బూబాబాద్ వెళ్లే వాహన దారులు ఎక్కువగా ఉండడంతో హైవేపై వాహనాలు రద్దీ పెరుగుతుంది. హైవే అధికారులు స్పందించి హైవేపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి, గ్రామంలో ప్రయాణిస్తున్నప్పుడు వాహనదారుల స్పీడు తగ్గించి ప్రమాదాలను అరికట్టాలి.



స్ట్రాంగ్ రూమ్ భద్రతను పరిశీలించిన పోలీసు కమిషనర్

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి ఎనుమాముల మార్కెటల్లో ఈవిఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లకు ఏర్పాటు చేసిన మూడంచెల భద్రతను వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఆకస్మిక తనిఖీ చేశారు. సోమవారం పోలీసు కమిషనర్ ఆకస్మికంగా వచ్చి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు నిర్వహిస్తున్న విధులపై పోలీసు కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించడంతోపాటు స్ట్రాంగ్ రూమ్‌లు మరింత భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు కమిషనర్ సంబంధిత కేంద్ర బలగాలు, స్థానిక పోలీసు అధికారులకు పలు సూచనలు సలహాలను అందచేశారు. పోలీసు కమిషనర్ వెంట ఎనుమాముల ఇన్స్‌పెక్టర్ పులి రమేష్ వున్నారు.



బాధితునికి ఆర్థికసాయం అందజేత

గీసుకొండ : మండలంలోని మనుగొండ గ్రామానికి చెందిన కంబాల రాంబాబు కొద్దిరోజుల క్రితం రోడ్ ప్రమాదంలో గాయపడి హాస్పటల్ చికిత్స పొందు తున్నాడు. కాంగ్రెస్ జిల్లా నాయకులు అల్లం బాలకిషోర్‌రెడ్డి స్పందించి కుటుంబానికి బాధిత కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని మండల నాయకులు అల్లం మర్రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాదాసి రాంబాబు,తోట కమలాకర్,కాయిత అశోక్ పాల్గొన్నారు.

వామ్మో కరెంటు వైర్లు

పంట పొలాల్లో చేతికందేలా వేడుతున్న తీగలు

పట్టించుకోని అధికారులు

అధికారుల నిర్లక్ష్యమే అంటున్న రైతులు

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని చింతనెక్కొండ శివారు ఏబీతండా గ్రామపంచాయతీ పరిధిలోని బోటికాటి తండా, చింత నెక్కొండలోని నాగులబోడు ప్రాంతాలలోని పంట పొలాల్లో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యుత్ తీగలు చేతికి అందేలా వేలాడుతున్నాయి. దీంతో రైతులు ఆ ప్రాంతాలకు రాగానే తమ ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని వెళుతున్నారు. ప్రమాదాలు సైతం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో రైతులు ఈ విషయమై పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇటీవల బోటికాడి తండాలో నల్లపు జనార్దన్, భూక్యా శ్రీనివాస్ బావివద్ద విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉండి ప్రమాదకరంగా ఉన్నాయంటూ గమనించిన తండావాసులు భయభ్రాంతులకు గురతున్నారు. ఈ క్రమంలో తండాలలో ప్రమాదాలు ఎన్నో జరిగాయి. అయినా విద్యుత్ అధికారులలో చలనం రాకపోగా పైగా తీవ్ర జాప్యం చేస్తున్నారని తాండావాసులు వాపోతున్నారు.

పంట పొలాల్లో విద్యుత్ తీగలు కిందకు పడిపోయే స్థితిలో ఉన్నాయని, విద్యుత్ స్థంబాలపైన తెగిపోయే స్థితిలో గందరగోళంగా వున్నాయని తెలుపుతున్నారు. గత వారం రోజుల ముందే సంబంధిత అధికారులకు వివరించినా ఫలితం మాత్రం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విచారం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాలలో కూడా ఇలాంటి అపాయాలు జరిగే సన్నివేశాలు అధికంగా ఉన్నాయని, ప్రమాదం జరిగిన తర్వాత తీసుకొనే చర్యలకన్నా, ప్రమాదం జరగకముందే జాగ్రత్తలు తీసుకోవటం మంచిదని,పంట పొలాల వద్ద వేలాడుతున్న తీగలను గుర్తించి తగిన మరమ్మత్తు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. సంబధిత విద్యుత్ అధికారులు నిద్రావస్తను వీడి,ప్రజల సంరక్షణ కోసం తమవంతుగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



మిడిల్ పోల్స్ వేసి చర్యలు చేపడుతాం : పాలడుగుల చంద్రమౌళి(ఏడీఈ)

విద్యుత్ స్థంబాల మధ్య దూరం ఎక్కువగా వున్న చోట్ల మిడిల్ పోల్స్ వేసి వైర్లను సరి చేస్తాం. ఎన్నికల కోడ్ అమలులో వున్నందున మరమ్మతులు చేపట్టలేక పోతున్నాం. కోడ్ ముగిశాక వెంటనే ప్రమాద నియంత్రణ చర్యలు తీసుకుంటాం.

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన కమలాపూర్ తహశీల్దార్

- రైతు ఫిర్యాదుతో తహశీల్దార్, ధరణి ఆపరేటర్ అరెస్ట్
- రూ.5 వేలు నగదు స్వాధీనం



నవతెలంగాణ-కమలాపూర్

రైతు నుండి లంచం తీసుకుంటూ కమలాపూర్ తహశీల్దార్ మాధవి ఏసీబీకి చిక్కింది. సోమవారం మండలంలోని కన్నూరు గ్రామానికి చెందిన కసరబోయిన గోపాల్ తన తండ్రి ఆస్తి నుండి గిఫ్ట్‌డీడ్ చేసుకోవటం కోసం ధరణిలో చలాన్ మొత్తం చెల్లించి తహశీల్దార్‌ను సంప్రదించగా తన ఫైల్‌ను పక్కకు పెట్టి రూ.6 వేలు డిమాండ్ చేయటంతో బాధితుడు వరంగల్ ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా నేడు ధరణి ఆపరేటర్ రాకేష్ బాధిత రైతు వద్ద రూ.5 వేలు తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తన బృందంతో తహశీల్దార్ మాధవిని పట్టుకున్నారు. తహశీల్దార్ మాధవీ, ధరణి ఆపరేటర్ రాకేష్‌పై కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. బాధితుడు కాసర్ల గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం తన తండ్రి ఆస్తిమార్పిడి కోసం గిఫ్ట్ డీడ్ చేసుకోవటం దరఖాస్తు చేసుకుని తహశీల్దార్ కార్యాలయంలో అందజేయగా రూ.4 వే లు డిమాండ్ చేయటంతో చేసేదేమీ లేక ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. రూ.5 వేలు ధరణి ఆపరేటర్ రాకేష్ ద్వారా తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తన బృందం పట్టుకున్నారు.

అవినీతి తహశీల్దార్ మాధవిని ఏసీబీ అధికారులకు పట్టించడం పట్ల మండల ప్రజలు హర్షం వక్తం చేశారు.

వేగవంతంగా పనులు పూర్తి చేయించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా



నవతెలంగాణ-శాయంపేట

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు ప్రభుత్వ పాఠశాలలో చేపడుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేయించాలని అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల, కొత్తగట్టు సింగారంలోని ప్రాథమికోన్నత పాఠశాల, మాందారిపేటలోని ప్రాథమిక పాఠశాల, తహరాపూర్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అమ్మఆదర్శ పాఠశాల పథకంలో జరుగుతున్న పనులను సోమవారం అడిషనల్ కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. విద్యుత్ ఫిట్టింగ్, కులాయిల ఏర్పాటు, ఫ్లోరింగ్, టైల్స్ పనులను త్వరత్వరతగతిన పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలలు ప్రారంభ గడువులోగా పనులు పూర్తిచేసి విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని ఆదేశించారు. పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫణిచంద్ర, డిఈ రవీందర్, ఏఈ రాజు, ఇన్చార్జి ఎంఈఓ రమాదేవి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డీసీసీబీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఐనవోలు



ప్రజలు, రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన నూతన డీసీసీబీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు మేనేజర్ శ్రావణ్ కుమార్ అన్నారు. మండలంలోని పెరుమాండ్లగూడెం గ్రామంలో సోమవారం జరిగిన సమావేశంలో మేనేజర్ మాట్లాడుతూ 107 సంవత్సరాల పైగా చరిత్ర కలిగిన డీసీసీబీ ఐనవోలు మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రాంచ్ ద్వారా అందిస్తున్న రుణాలు, సదుపాయాలను వివరించారు. బ్యాంకు ఖాతాదారులకు వ్యవసాయ అనుబంధ రుణాలు, స్వయం సహాయక పొదుపు సంఘాలకు రుణాలు, వ్యక్తిగత రుణాలు, వాహన, విద్య రుణాలు, బిజినెస్ రుణాలు, క్యాష్ క్రెడిట్ రుణాలతో పాటుగా, పీఎంఎస్‌బీవై, పీఎంజెజెబివై, ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు పీఎంఈజీపి రుణాలు అందిస్తున్నామని బీఎం తెలిపారు. ఈ సేవలను మండల కేంద్రంలోని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోగలరని అలాగే నూతన ఖాతాదారుల ఖాతాలను ఓపెన్ చేశారు. ఈ కార్యక్రమంలో నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కలపల్లి చందర్ రావు, బ్యాంక్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నగర ప్రజలను అలరిస్తున్న లండన్ సిటీ ఎగ్జిబిషన్

- లండన్ వీధులు కళ్లకుకట్టేలా సెట్టింగ్
- ప్రజలకు ఆహ్లాదాన్ని అందిస్తున్న ఎగ్జిబిషన్

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా





ప్రజలకు వినోదాన్ని పంచేందుకు హనుమకొండ బాలసముద్రంలోని హయగ్రీవచారి మైదానంలో ఏర్పాటు చేసిన లండన్ సిటీ ఎగ్జిబిషన్ పిల్లలు, పెద్దలను అందర్నీ ఆకట్టుకుంటుంది. నిత్యం ఏదో ఒక సమస్యల దృష్ట్యా ప్రజలు సతమతమవుతున్న ట్రై సిటీ ప్రజలకు ఆహ్లాదాన్ని అందిస్తుంది. మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు ఈ ప్రదర్శన సందర్శించి వీక్షించడం వల్ల మనశాంతి దొరుకుతుందని పట్టణ వాసులు ఎగ్జిబిషన్ కు తండోపతండాలుగా క్యూ కడుతున్నారు. ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను పిల్లలు పెద్దలు వీక్షిస్తూ కొత్త అనుభూతిని పొందుతున్నారు.

ముఖ్యంగా లండన్ సిటీఎగ్జిబిషన్లో ఏర్పాటుచేసిన జాయింట్ వీల్స్, బ్రేక్ డాన్స్, డ్రాగన్ ట్రైన్, కొలంబస్, చాంద్ తార, వాటర్ బోటింగ్, బౌన్సర్, మినీ ట్రైన్, జంపింగ్, హాలీవుడ్‌బాల్స్, రిమోట్ కార్స్ తో ప్రేక్షకులు ఆకర్షితులై సాయంకాల సమయంలో మరో కొత్త ప్రపంచంలో ఉన్నట్టు అనుభూతిని పొందుతున్నారు. ఎగ్జిబిషన్లో ఏర్పాటుచేసిన తినుబండారాలు ఢిల్లీ మసాలా పాపడు, సిమ్లా మిర్చి బజ్జి, ఐస్ క్రీమ్, సోడా, స్వీట్ కార్న్, పాప్ కార్న్ చార్ట్ బండర్ మొదలైన పదార్థాలను సేవిస్తూ నగర ప్రజలు ఎంజాయ్ చేస్తున్నారు. ఎగ్జిబిషన్ ప్రొప్రైటర్ అస్లాం, మేనేజర్ ఫిరోజ్‌లు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా హనుమకొండ నగరంలో నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు వెరైటీ ఎగ్జిబిషన్లతో సరికొత్త అనుభూతిని అందిస్తున్నామని అన్నారు. ఈ సంవత్సరం లండన్ సిటీ ఎగ్జిబిషన్ పేరిట లండన్ నగరంలోని వీధులను చూపించే విధంగా సరికొత్త సెట్టింగ్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. నగర ప్రజలందరూ ఎగ్జిబిషన్‌ను సందర్శించి ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఎగ్జిబిషన్లో నిర్వాహకులు ప్రత్యేకంగా రూపొందించిన లండన్ సిటీ వీధులను సందర్శకులు చూసి మరిచిపోతూ సెల్ఫీలు దిగుతూ ఆ ఆనందాన్ని మిత్రులతో పంచుకుంటున్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-దామెర

దామెర మండలం పులకుర్తి గ్రామానికి చెందిన ఇమ్మడి శరత్ గత పదిరోజుల క్రితం దామెర పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ శివారులో తన మొబైల్ ఫోన్ పోగొట్టుకొని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా దామెర ఎస్సై కొంక అశోక్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోను టేస్ చేసి అతనికి అప్పగించారు.

అసంపూర్తి డబుల్ రోడ్డుతో ప్రజల అవస్థలు

- వెంటనే పనులు ప్రారంభించాలని స్థానికుల డిమాండ్



నవతెలంగాణ-ఆత్మకూరు

గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామాల లింక్‌రోడ్డు నిర్మాణ పనుల్లో అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆత్మకూరు మండలంలోని హౌజుబుజుర్గు నుండి శాయంపేట మండలంలోని ప్రగతిసింగారం వరకు 10 కిలోమీటర్ల డబుల్‌రోడ్డు నిర్మాణానికి రూ.3.20 కోట్లు మంజూరు కాగా ఎ.సమ్మయ్య అండ్ కంపెనీ పనులను చేజిక్కించుకుంది. గత సంవత్సరం డబుల్‌రోడ్డు పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ హౌజుబుజుర్గు గ్రామంలో ఒక వైపు మాత్రమే రోడ్డు నిర్మించి మరోవైపు డబుల్ రోడ్డునిర్మాణం చేయకుండా అధికారులు, గుత్తేదారువిస్మరించారు. గత ఏడాదికాలంగా సింగిల్ రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో హౌజుబుజుర్గు నుండి శాయంపేట మండలంలోని నేరేడుపల్లి, గొల్లపల్లి, అప్పయ్యపల్లి, సింగారం గ్రామాల్లోని క్రషర్లకు వెళ్లే భారీవాహనాల రాకపోకలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సింగి ల్ రోడ్డుతో పలుమార్లు ప్రజలకు ప్రమాదాలకు గురయ్యారు.

వెంటనే డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి : అర్షం రాంకీ, కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి



మండలంలోని హౌజుబుజుర్గు గ్రామంలో సంవత్సరం గడుస్తున్న డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టకుండా అధికారులు, కాంట్రాక్టర్‌లు నిర్లక్ష్యం చేశారని ఆయన విమర్శించారు. అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణ పనులను వర్షాకాలం రాకముందే వెంటనే చేపట్టి పూర్తి చేయాలి.

అదనపు నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం : డీఈ

ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని 'నవతెలంగాణ' పంచాయతీరాజ్ డీఈ భానుప్రసాద్‌ను వివరణ కోరగా డబుల్‌రోడ్డు విస్తరణలో రోడ్డు మధ్యలో పైప్‌లైన్ ఉన్నందున దానిని తొలగించేందుకు పనులు ఆపాల్సివచ్చింది. హౌజ్‌బుజుర్గులో 1 కిలోమీటర్ సీసీరోడ్డు వేశాము, 1 కిలోమీటర్ డబుల్ రోడ్డు పనులు పూర్తిచేయాల్సి ఉంది. కానీ రోడ్డునిర్మాణానికి 3.21 లక్షల కు మించి 5శాతం అదనపు ఖర్చుపెరగడం వలన ప్రభుత్వానికి నివేదిక పంపించాము. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున జూన్ తర్వాత ఫండ్ రాగానే పనులు ప్రారంభిస్తాం.

సేంద్రీయ ఎరువుతో నేలకుసారం.. పంటలకు జీవం



నవతెలంగాణ-శాయంపేట

పంట దిగుబడి సాధించేందుకు అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. కొన్నిరోజుల్లో ఖరీఫ్ సీజన్ మొదలుకానుండడంతో దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. నేలను సారవంతం చేయడం, భూసారాన్ని పెంచడం, దుక్కులు దున్నడం తదితర పనుల్లో రైతులు తీరికలేకుండా ఉన్నారు. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకంతో పొలాల్లోని తేమ దెబ్బతిని, మిత్ర పురుగులు, పోషక విలువలు నశించిపోతున్నాయి. దీంతో రైతు ఆశించిన దిగుబడి రావడం లేదు. పెట్టుబడి పెరిగి అప్పుల బాధతో కుంగిపో వాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయ పథకాన్ని రైతులు వినియోగించుకుంటు న్నారు. చెరువుల్లో తీసిన పూడిక మట్టిని తమ పొలాలకు తరలించుకుంటూ నేలను సారవంతం చేసుకుంటున్నారు. ఈ ఒండ్రు మట్టిలో ఉన్న పోషక గుణాలు పంట దిగుబడికి దోహదపడతాయి.

దీంతో రైతు లు నష్టపోకుండా లాభాలు ఆర్జించేందుకు అవకాశం ఉంది. సేంద్రియ ఎరువుగా ఉపయోగపడే ఈచెరువు మట్టి కోసం రైతులు పోటీపడుతుండడం గమనార్హం.

అనేక పోషకాలు ఉంటాయి : కే.గంగజమున, ఏవో శాయంపేట



చెరువు మట్టిలో తగినంత నత్రజని, పొటాషియం, భాస్వరం, జింకు, బోరాన్, సేంద్రియ కర్బన పదార్థాలు, మొక్కల పెరుగుద లకు దోహదం చేసే సూక్ష్మ జీవులు మెండుగా ఉంటాయి. కిలో పూడి కమట్టిలో నత్రజని 720 మి.గ్రా., భాస్వరం 320 మి.గ్రా., పొటాషియం 310 మి.గ్రా, సేంద్రియ. కర్బనం 9.1 గ్రా ములు, మైక్రోబియల్ బయోమాస్ కార్బన్లు 308 మి.గ్రాములు ఉంటాయి. పూడిక మట్టిని వాడడం వల్ల ఒక ఎకరాకు రూ.2,000 నుంచి రూ.2,750 వరకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గుతుంది. మట్టిలో పోషక విలువలు పెరగడంతో పాటు తేమను నిలిపే సామర్థ్యం పెరుగుతుంది.

సేంద్రియ ఎరువు కొనుగోలు చేశా : నీల రవీందర్‌రెడ్డి, రైతు



నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిలో సారం లేక ఆశించిన దిగుబడి రావడం లేదు. ఒక ట్రాక్టర్ పశువుల పేడకు రూ.1,200 చొప్పున పన్నెండు ట్రాక్టర్ల ఎరువు కొనుగోలు చేసి చేనులో చల్లాను. చెరువు మట్టి కూడా ఎంతో ఉపయోగపడు తుంది, కాని చెరువు మట్టి తరలింపు సన్న చిన్న కారు రైతులకు భారం అవుతోంది. ట్రాక్టర్ ట్రిప్పునకు ప్రభుత్వం రూ.100 చెల్లించి రైతు లను ఆదుకుంటే బాగుంటుంది. ట్రాక్టర్లు ఉన్న రైతులు మాత్రమే మట్టిని తరలించుకునేందుకు మొగ్గు చూపుతున్నారు.

మూడేళ్ల వరకు ఎరువుగా : మేకల సాంబలక్ష్మీ, మహిళా రైతు



సేంద్రియ ఎరువులు, చెరువుమట్టి పొలాల్లో మూడేళ్ల వరకు భూసారాన్ని తగ్గకుండా కాపాడతాయి. గతంలో రెండు ఎకరాలల్లో చెరువు మట్టిని తరలించి ఖరీఫ్లో పత్తి సాగు చేశాను. ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. చెరువు మట్టిలో ఎరువుల వాడకం తగ్గుతుంది. మొక్క ఏపుగా పెరగడంతో పాటు మంచి దిగు బడి సాధించవచ్చు.

కోరిన కోర్కెలుతీర్చే కలియుగ దైవం శ్రీ మత్స్యగిరిస్వామి

- కాకతీయుల కళావైభవానికి ప్రతీక
- రాష్ట్రంలోనే రెండో పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి
- నేటి నుండి తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాలు



నవతెలంగాణ-శాయంపేట

మండల కేంద్రంలోని శ్రీ మత్స్యగిరిస్వామి కలియుగంలో కోరిన కోర్కెలు తీర్చే దైవంగా ప్రసిద్ధి చెందాడు. కాకతీయ రాజుల కళా వైభవానికి ప్రతికగా నిలిచిన మత్స్యగిరి స్వామి ఆలయం ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ పౌర్ణమి, పంచమ రాత్రి ఆగమశాస్త్రం ప్రకారం స్వామి వారి తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. మంగళవారం నుండి శనివారం వరకు ఉత్సవాలను నిర్వహించడానికి ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలు, త్రాగునీటి వసతి సమకూర్చినట్లు దేవాలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ సామల బిక్షపతి, ఆలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు తెలిపారు.

ఆలయ చరిత్ర ...

శాయంపేట గ్రామ పొలిమేరలోని మచ్చర్లగుట్టపై శ్రీ మత్స్యగిరి స్వామి 568 సంవత్సరాల క్రితం కొలువుదీరినట్లు పూర్వీకులు పేర్కొంటున్నారు. మహావిష్ణువు దుష్టశిక్షణకై దశావతారాలలో భాగంగా మొదట మత్స్యవతారంగా వెలసినట్లు చెబుతున్నారు. మచ్చర్లయగుట్ట వద్ద గ్రామ్య భాషలో శాలివాహన శకంలో వేయించిన శిలాశాసనం ద్వారా ఆనాటి దేవాలయ చరిత్ర తెలియజేస్తుంది. గుట్ట లోపల బండరాయిపై సహజ సిద్ధంగా మచ్చా అవతారంలో స్వామివారు దర్శనం ఇస్తున్నారు. ఈ గుట్ట లోపటికి వెళ్లేందుకు ఒకే ఒక చిన్న సొరంగ మార్గం ఉంటుంది. ఇక్కడ 14 దేవాలయాలు, 24 మంది అర్చకులు ఉండేవారని ఈ శిలాశాసనం ద్వారా తెలుస్తుంది. అప్పుడు నిర్మించిన దేవుని చెరువు నేటికీ అదే పేరుతో పిలువబడుతున్నది.

కాకతీయ సామంతరాజు కొత్తగట్టు సీమ పాలకుడు రేచర్ల దర్శనాయుడు తన తల్లిదండ్రులు సింగమాంబ, సింగమ నాయుడు దేవాలయం నిర్మించినట్లు తెలుస్తుంది. కాలక్రమంలో మచ్చర్లయ్య గుట్ట వద్ద నుంచి గ్రామం దూరంగా వెళ్లిపోయింది. గ్రామం మధ్యలో రాతితో శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయాన్ని నిర్మించారు. దేవాలయ గోపురం పైన మహావిష్ణువు దశావతారాలు భక్తులకు దర్శనమిస్తాయి.

కల్యాణోత్సవ కార్యక్రమాలు ...

మే 21 మంగళవారం ఉదయం తోలక్కం ప్రారంభం, పుట్ట బంగారు సేవ, మధ్యాహ్నం ధ్వజారోహణం, గరుడ ముద్ద, సాయంత్రం ఎదురుకోళ్లు, 22 న ఉదయం 11 గంటలకు కళ్యాణోత్సవం, మధ్యాహ్నం ఒంటిగంటకు మహా అన్నదాన కార్యక్రమం, 23న ఉదయం పూర్ణాహుతి, సాయంత్రం 6 గంటల కు గజవాహన సేవ, గుట్టమీదికి పోవడం, 24న సాయంత్రం రథోత్సవం, అ లుక తీరుట, 25న ఉదయం చక్రవర్తీ, సాయంత్రం నాకబలి, నాగవల్లి, పండి త స న్నానంతో ఉత్సవాలు ముగిస్తాయని దేవాలయ చైర్మన్ సామల బిక్షపతి తెలిపారు. ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని చైర్మెన్ బిక్షపతి కోరారు.

ఘనంగా ధ్వజారోహణం

నవతెలంగాణ-ఆత్మకూర్



శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి అధ్యాయన బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆత్మకూరు మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం ఆలయ అర్చకులు ఆరుట్ల మాధవ మూర్తి ఆచార్యులు, వేద పండితుల మధ్య ధ్వజారోహణ కార్యక్రమం, గరుడముద్ద అత్యంత వైభవంగా జరిగింది. తొలుత ఉదయం పుణ్యాహవచనం, త్యాగశాల ప్రవేశం, అంకురారోపణ, ధ్వజా రోహణం, భక్తుల కోలాహల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా అర్చకులు మాధవమూర్తి ఆచార్యులు మాట్లాడుతూ సాయంత్రం బేరి పూజ, దేవత ఆహ్వానం, హెూమము, బలిహరణము, ఉంటుందని అదేవిధంగా మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రబోధకి, హెూమం, బలిహరణం, సాయంత్రం హెూమం, బలిహరణం, రాత్రి 8 గంటలకు శ్రీవారి కళ్యాణ మహోత్సవం జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కపాకటాక్షాలు పొందాలని పేర్కొన్నారు.

స్ట్రాంగ్ రూములను తనిఖీ చేసిన కలెక్టర్



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలను వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని స్ట్రాంగ్ రూములలో భద్రపరచగా హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ సోమవారం తనిఖీ చేశారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న హనుమకొండ జిల్లాలోని పరకాల, వరంగల్ పశ్చిమ శాసనసభ నియోజక వర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలను స్ట్రాంగ్ రూములలో భద్రపరిచారు. కాగా సాధారణ తనిఖీల్లో భాగంగా కలెక్టర్ పరిశీలించి స్ట్రాంగ్‌రూముల వద్ద భద్రతా ఏర్పాట్లు, రికార్డుల నిర్వహణ, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ, తదితర ఏర్పాట్లను గురించి కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హనుమకొండ తహసిల్దార్ విజయ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మూగజీవాల దాహార్తి తీర్చడం అభినందనీయం

నవతెలంగాణ-ఆత్మకూరు



గ్రామాల్లో సంచరించే మూగజీవాలైన కుక్కలు, కోతులు, కోళ్లు, పశుపక్షాదులకు వాటి దాహార్తి తీర్చుటకు ఎన్జీవోస్ రజని నీటితొట్లను బహుకరించడం పట్ల స్థానికులు అభినందిస్తున్నారు. ఆ తొట్లను ఆత్మకూర్ గ్రామ పంచాయితీ సిబ్బంది ద్వారా వెటర్నరీ హాస్పిటల్, బ్రాహ్మణపల్లి వెళ్లేదారిలో నీటి తొట్లను అమర్చడం జరిగినదని గ్రామ కార్యదర్శి మేడ యాదగిరి తెలిపారు.

యువజన సంఘానికి క్రికెట్ కిట్ పంపిణీ

నవతెలంగాణ-వేలేరు



మండలంలోని షోడశపల్లి గ్రామ యువజన సంఘానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి క్రికెట్‌ను అందించారు. గ్రామానికి చెందిన యువకులు దార దినేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి క్రికెట్ కావాలని కోరడంతో రూ.50వేల కిట్‌ను అందించి యువత క్రీడలతోపాటు చదువుపై దృష్టిసా రించి జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు వినయ్, బుచ్చిరెడ్డి, చంటి, ప్రదీప్, రాహుల్, వెంకటేష్,రాజు,అక్షయ్,సూర్య, శ్రీరామ్,సన్నీ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ మద్దతు

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

నల్గొండ-ఖమ్మం వరంగల్ పట్టభద్రుల నియో నికి జరుగుతున్న ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో తెలుగు పార్టీ వరంగల్ పార్లమెంట్ కమిటి బీజేపీ ప్రేమేందర్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు నిస్తున్నట్లు టీడీపీ నాయకులు సాంబయ్య తెలిపారు. ఎన్డీఏ కూటమిలో భాగస్వామిమైన దేశం ఆంధ్రాలో అధికారానికి రావడం తెలంగాణలో సైతం ఈ మధ్యనే ముగిసిన ఎన్నికల్లో మజార్టీ సీట్లు గెలవడమే కాకుండా కేంద్రంలో సైతం మూడోసారి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయ బోతున్నది. ఈ అభివృద్ధి ఇలానే కొనసాగాలంటే ఎన్డీఏ మరింత బలపడాల్సిన అవసరం ఎంతైనా ఉంది కావున నల్గొండ-ఖమ్మం- వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గంలోని పట్టభద్రులైన ఓటర్లు ఏఖ్యతతో ఆలోచించు. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు.

జర్నలిస్టులకు క్రీడా పోటీలు

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులైన జర్నలిస్టు మిత్రులకు ఆటవిడుపు, ఉల్లాసం కోసం క్రీడల పోటీలు నిర్వహించాలని నిర్ణయించినట్లు గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధానకార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బొల్లం అమర్‌లు తెలిపారు. క్రికెట్, వాలీబాల్, క్యారం, చెస్, షటిల్ క్రీడలలో ఆసక్తి ఉన్న జర్నలిస్టులు మే 21 నుంచి 24 వరకు ప్రెస్‌క్లబ్‌లో నేరుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అన్ని క్రీడాంశాలకు సంబంధించి జర్నలిస్టులు (చెస్‌మినహా) జట్ల వారిగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.గడువులోగా పేర్లు నమోదు చేసుకోని వారికి క్రీడా పోటీలలో పాల్గొనే అవకాశం ఉండదని వారు పేర్కొన్నారు. పేర్ల నమోదు అనంతరం క్రీడాంశాల వారీగా డ్రాలు తీసి పేర్లను ప్రెస్ క్లబ్ నోటీస్ బోర్డ్ పై అంటించడం జరుగుతుందని వారు తెలిపారు.

ఆ తదుపరి క్రీడా పోటీలను నిర్వహించి బహుమతులను అందజేయడం జరుగుతుందని ప్రెస్‌క్లబ్ ప్రతి నిధులు పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
జనగామ
మంగళవారం | మే 21, 2024 | www.navatelangana.com

బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు దరఖాస్తుల ఆహ్వానం : కలెక్టర్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



జిల్లాలోని గిరిజన విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరంలో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద 3, 5, 8వ తరగతిలో ప్రవేశం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో 1,50,000, పట్టణ ప్రాంతాలలో రెండు లక్షలలోపు ఉండాలని, లాటరీ పద్ధతిలో కలెక్టర్ కార్యాలయంలో విద్యార్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయం జనగామ, హన్మకొండలలో ఈనెల 21 నుండి జూన్ 6 సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలని సూచించారు. ఒక కుటుంబం నుండి ఒకరికి మాత్రమే ఈ స్కీంలో అర్హత ఉంటుందన్నారు.దరఖాస్తు ఫారంతో సంబంధిత తహసిల్దార్ నుండి మీసేవ ద్వారా తీసుకున్న కుల,నివాస, 1-4-2024 తర్వాత పొందిన ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ప్రస్తుత పాఠశాల నుండి బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డులను జత చేయాలని కలెక్టర్ సూచించారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఏసీపీ

నవతెలంగాణ-కొడకండ్ల

ఈ నెల 27న వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రులు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని వర్ధన్నపేట ఏసీపీ నరసయ్య, పాలకుర్తి మహేందర్ రెడ్డి, కొడకండ్ల ఎస్సై శ్రావణ్ కుమార్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ అంజయ్య, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





జనగామలో బెస్ట్ అవైలబుల్ స్కీం అమలు చేయాలని వినతి

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జనగామ పట్టణంలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కీము అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ కార్యనిర్వాహక సభ్యులు యాసారపు కర్ణాకర్ కలెక్టరేట్ ఏవో రవీందర్‌కు వినతి పత్రం అందజేశారు. జనగామ పట్టణంలో ఈ స్కీం పాఠశాలల్లో అమలు లేకపోవడంతో పట్టణ పరిసర గ్రామాల షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు నష్టపోతున్నారని తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి

- తహసీల్దార్‌కు బాధితుడు రాజ్‌కుమార్ వినతి

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్



తనకు తెలియకుండానే రెవెన్యూ అధికారులు చేసిన అక్రమ రిజిస్ట్రేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని చిల్పూర్ మండల కేంద్రానికి చెందిన బాధితుడు బోళ్ల రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాధితుడు రాజ్ కుమార్ డివిజన్ కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల అనివార్య కారణాలతో, కుటుంబంలో కొద్దిపాటి గొడవలు తలెత్తడంతో తనకు ఎలాంటి సమాచారం లేకుండా, తెలియకుండా గ్రామ రెవిన్యూ అధికారులు తన భార్య పేరిటనున్న చిల్పూర్ గ్రామ శివారులోని ఎకరా 24 గుంటల భూమిని ఎలాంటి పత్రాలు లేకుండా, పట్టాదారు పాసుపుస్తకం లేకుండానే వ్యవసాయ భూమిని, హన్మకొండ జిల్లా కాజీపేట మండలం, రాంపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి రిజిస్ట్రేషన్ అయినట్లు ఉందని, పట్టాదారు పాసుపుస్తకంతో బ్యాంక్‌లో రుణం కూడా ఉందని, అక్రమంగా రిజిస్ట్రేషన్ కావడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, రెవెన్యూ అధికారులు స్పందించి, తక్షణమే ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి న్యాయం చేయాలని కోరారు.

రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ అరెస్ట్

నవతెలంగాణ-బచ్చన్నపేట



రెవిన్యూ సీనియర్ అసిస్టెంట్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు. వివరాలలోకి వెళితే మండలంలోని పడమటి కేశవపూర్ గ్రామానికి చెందిన రైతు కొమ్మాట రఘుపతి ఆత్మహత్య చేసుకున్న కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడైన సీనియర్ అసిస్టెంట్ కొలిపాక సుమన్‌ను ఈ రోజు అరెస్టు చేసి అతని వద్ద నుండి ఒక సెల్ ఫోన్‌తో పాటు రూ. 60,000 నగదు సీజ్ చేసి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించడం జరిగిందని తెలిపారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

నవతెలంగాణ-కొడకండ్ల



మాజీ ఎంపీపీ రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ జక్కుల విజయ ప్రభాకర్ తమ్ముడు ఎల్లయ్య అలియాస్ స్వామి అనారోగ్యంతో వారం రోజుల క్రితం మృతి చెందగా వారి కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల మృతి

- రామవరంలో విషాద ఛాయలు - పరామర్శించిన ఝాన్సీరెడ్డి

నవతెలంగాణ-కొడకండ్ల

హైదరాబాద్ రోడ్డు ప్రమాదంలో మేటి శివ, శ్రవణ్ కుమార్ ఇద్దరు అన్నదమ్ములు అక్కడికక్కడే మృతి చెందగా రామవరం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. రామవరం గ్రామానికి చెందిన మేటి రాములుకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుని వివాహం కాగా మరో ఇద్దరు కుమారులు హైదరాబాదులో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఉదయం 8 గంటల ప్రాంతంలో కర్రీ పాయింట్ వద్దకు కర్రీ కోసం బైక్‌పై వెళ్తుండగా యూటర్న్ చేస్తున్న సమయంలో వెనుక నుండి వచ్చిన కారు ఢీ కొట్టడంతో అన్నదమ్ములు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. అన్నదమ్ముల మృతితో ఆ కుటుంబంతో పాటు రామవరం గ్రామంలో ఛాయలు అలుముకున్నాయి.

మృతుల కుటుంబాలకు పరామర్శ....

పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి మృత దేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించి ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూత తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తురులో గంగమ్మ తల్లి జాతర



తొర్రూర్ రూరల్ : గుర్తురు గ్రామంలోని గంగపుత్రులు గంగమ్మ తల్లి జాతర వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారు. ప్రధానంగా ప్రత్యేక ఆకర్షణగా తెల్ల దుస్తులను ధరించి జల బిందెలు, మంగళారతులతో డప్పు చప్పుళ్ళ నడుమ ఆట పాటలతో నృత్యాలు చేస్తూ దేవాలయం వద్దకు చేరుకొని గంగమ్మ తల్లి విగ్రహాలను శుద్ధి చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య సొసైటి, గంగా పుత్ర సంఘం నాయకులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలకు...

పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో ఏసీపీ అంకిత్ కుమార్ శంక్వార్‌తో కలిసి కలెక్టర్ ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ నెల 24 నుంచి జూన్ 1 వరకు జరిగే ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 11 సెంటర్లలో మొదటి సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 1879, వొకేషనల్ విద్యార్థులు 505కు మొత్తం 2384 మంది విద్యార్థులు కాగా, రెండవ సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 1230, వొకేషనల్ విద్యార్థులు 376కు మొత్తం 1606 మంది విద్యార్థులకు గాను, మొత్తంగా 3990 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. మొదటి ఏడాది ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, రెండవ ఏడాది మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. అదే విధంగా ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 4 నుంచి 8 వరకు ఒక సెంటర్‌లో జరగనున్నట్లు పేర్కొన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు జరుగుతాయని వివరించారు. ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, ఒక సిట్టింగ్ స్క్వాడ్ టీమ్‌లను నియమించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఐఈఓ ఆంజనేయరాజు, ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న, డీఈఓ రాము, డీఎంహెచ్ఓ హరీష్ రాజ్, ఆర్టీసీ డిపో మేనేజర్ జ్యోత్స్న, వివిధ శాఖల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకు చాకలి ఐలమ్మ పేరు పెట్టాలి

- రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏదునూరి మధార్

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్



చారిత్రక నేపథ్యం ఉన్న జనగామ జిల్లాకు తెలంగాణ రైతంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని తెలంగాణ రజక వృత్తి దారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏదునూరి మధార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పాలకుర్తి నియోజకవర్గం కేంద్రంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రజక వృత్తిదారుల సంఘం మండల ఉపాధ్యక్షులు గుమ్మడి రాజు, పాపయ్య అధ్యక్షత వహించగా మధార్ పాల్గొని మాట్లాడారు. జనగామ ప్రాంతం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పుట్టినిల్లు అని అన్నారు. చారిత్రక సాయుధ పోరాటంలో నిజాం ప్రభుత్వానికి ఎదురొడ్డు పోరాడిన గడ్డ జనగామ అని వారన్నారు. బాంచన్ దొర నీ కాళ్ళు మొక్కుతా అనే గులాంగిరి విధానానికి తిరుగుబాటు చేసి తెలంగాణలో పేరుగాంచిన స్థానిక జమీందార్ విసునూరు రాపాక రామచంద్రారెడ్డి నిరంకుశత్వానికి ఎదురొడ్డిన పోరాటం చేసిన వీర వనిత ఐలమ్మ అని అన్నారు. చారిత్రక నేపథ్యం ఉన్న జనగామ ప్రాంతానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని, గత ప్రభుత్వం చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని గుర్తించి ఐలమ్మ జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా జరపాలని తీర్మానం చేసిందని అన్నారు. ప్రభుత్వం పరిశీలించి జనగామ జిల్లాకు ఐలమ్మ పేరు ప్రకటన చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం నాయకులు డాక్టర్ లోంక మల్లేష్, చిట్యాల వెంకన్న, గుమ్మడి రాజు కొమురయ్య, చిట్యాల సంపత్, చిట్యాల మధు, గుడికందుల రవి, జి.బిక్షం, ఏ.సత్తయ్య పి.సోమయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి





నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎన్నికల నియోజక వర్గ ఇంచార్జీ తాటికొండ రాజయ్య అన్నారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా సోమవారం నియోజక వర్గ కేంద్రంలో పట్టభద్రుల ఇన్చార్జిలతో సన్నాహక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా చొప్పదండి మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సుంకె రవిశంకర్‌తో కలిసి, స్టేషన్‌ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డిని గెలిపించాలని, ప్రశ్నించే గొంతుకను చట్టసభకి పంపాలని ఓటర్లకు అర్థమయ్యే రీతిలో వివరించాల్సిన బాధ్యత బూత్ ఇన్చార్జిలదే అన్నారు. మండలంలో మూడు పోలింగ్ బూత్‌లకు కలిపి 2వేలకు పైగా గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారని అన్నారు. కష్టపడి పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్, మాజీ సర్పంచ్ సురేష్ కుమార్, మల్లేశం, నాయకులు పొన్న రజిత రంజిత్, కనకం గణేష్, అశోక్, గాదె రాజు, గుండె మల్లేష్, కుమారస్వామి, చిట్టి బాబు, బూత్ ఇన్చార్జిలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కొడకండ్ల : ఖమ్మం వరంగల్ నల్లగొండ పట్టబధ్రుల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన ఏనుగుల రాకేష్ రెడ్డిని అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని పాలకుర్తి జెడ్పీటీసీ, ఎమ్మెల్సీ కొడకండ్ల మండల ఇన్చార్జి పుష్కూరు శ్రీనివాస్ అన్నారు. సోమవారం బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ మంత్రి ఆదేశాల మేరకు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడకండ్ల మండలంలోని పట్టభద్రులను ఏకం చేసి బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ పట్టభద్రుల ఎన్నికల అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాము, పార్టీ మండలాధ్యక్షుడు రామోజీ, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మండల నాయకులు రాజిరెడ్డి, ప్రేమ్ కుమార్, వెంకట్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పది రూపాయల నోట్ల కొరత


- మార్కెట్లో కనిపించని 'పది' నోట్లు - చిల్లర కష్టాలు
- నాణేలు ఉన్నా చెల్లవంటూ వదంతులు

నవతెలంగాణ-తొర్రూరు

మార్కెట్లో 10 రూపాయల కరెన్సీ నోట్ల కొరత తీవ్ర సమస్యగా మారింది. ఎక్కడ 20 రూపాయల నోటు ఇచ్చిన తిరిగి పదిరూపాయలు ఇవ్వాలంటే లేదు అనే పరిస్థితి ఎదురవుతుంది. వ్యాపారులు, వీధి వ్యాపారులతోపాటు ఇటు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుంది. గతంలో పది రూపాయల నాణాలు చెల్లవనే గోల ఉండగా.. ఇప్పుడు నోట్ల కొరత కొత్త సమస్యలు తెచ్చిపెడుతుంది. 2017లో పది రూపాయల నాణాలు చెల్లవంటూ వదంతులు వ్యాపించాయి. దుకాణాలు, చిల్లర వ్యాపారులు, కూరగాయలు, ఇతర మార్కెట్లలో నాణేలు చెల్లవని తీసుకోవడానికి నిరాకరించారు. తక్కువ మంది నాణాలు తీసుకుంటుండగా.. చాలామంది తమ వద్ద ఉన్న నాణాలను బ్యాంకుల్లో అప్పగించి నోట్లతో మార్పిడి చేసుకున్నారు. ప్రస్తుతం పది రూపాయల నోట్ల చలామణి తగ్గిందని వ్యాపారులు వాపోతున్నారు. నోట్ల కొరతకు కారణం ఏమిటనేది ఎవరికి అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు ఆటోలు, చిన్నపాటి కిరాణం, జనరల్, బేకరీ దుకాణాల్లోనే కాదు ప్రతి చిన్న పెద్ద వ్యాపార వర్గాలకు నోటు కొరత తీరని సమస్యగా మారింది. చిన్న వ్యాపారులు ఏదో ఒక వస్తువు ఇచ్చేసి చేతులు దులుపుకుంటూ ఉండగా కొన్ని సందర్భాల్లో వ్యాపారుల వద్ద పది రూపాయల నోటు ఇవ్వాల్సిందే అంటూ వాదనలు చోటు చేసుకున్న సందర్భాలు అనేకం.

చిల్లర వర్తకుల నుంచి ఇదే పరిస్థితి...

కూరగాయలు, పాలు, పండ్లు, కిరాణం, టీ స్టాళ్ళు, చిరు హొటల్‌ల వద్ద పది రూపాయల నోట్ల కొరతతో నానా ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్లో చిల్లర కోసం తిరిగిన ఎవరూ ఇవ్వలేని పరిస్థితి. ఇక పెట్రోల్ బంక్‌లోను కొరత ఉంది. ప్రస్తుతం చాలామంది దగ్గర ఉన్న నోట్లు కూడా చిరిగి కనిపిస్తున్నాయి. జేబులో ఉన్న 20 రూపాయల నోటుతో టీ తాగిన, టిఫిన్ సెంటర్లో 50 రూపాయల నోటు ఇచ్చిన తిరిగి పది రూపాయల నోటు తీసుకోవాలన్న దొరకని పరిస్థితి. చిరు వ్యాపారుల నుంచి పెద్ద వ్యాపారుల వరకు నోట్ల సమస్య ఎదుర్కొంటున్నారు. ప్రజలు, వ్యాపార వర్గాలు ఎదుర్కొంటున్న ఈ విపత్కర ఇబ్బందులకు పరిష్కారం చూపాల్సిన బ్యాంకు అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పది రూపాయల నోటు దొరకడం లేదని నోటు తమ పాలిట చేటుగా మారిందని వ్యాపారులు వాపోతున్నారు.



అవగాహన కల్పించాలి : తాటికొండ సంధ్యారాణి, కిరాణం వ్యాపారి, తొర్రూరు.



ముందు పది రూపాయల నాణాలు చెల్లుతాయని ప్రజలకు అవగాహన కల్పించాలి. నాణేలు చెల్లుబాటుపై మార్కెట్లో ప్రధాన కూడళ్లలో ప్రచార ఫ్లెక్సీలు ఇతర ప్రకటనలతో అవగాహన కల్పించాలి. నాణాలు చెల్లుతాయని చెప్పడం, పది రూపాయల నోట్ల కొరత తీర్చడం వంటి వాటిపై బ్యాంకు అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి. మార్కెట్లో ప్రస్తుతం నెలకొన్న పది రూపాయల నోట్ల చిల్లర సమస్య తీరేలా చూడాలి.

ఆర్‌బీఐ చర్యలు చేపట్టాలి : జి.రమ్య, జిరాక్స్ సెంటర్, తొర్రూరు



ప్రస్తుతం మార్కెట్లో వ్యాపారులు, ప్రజలు ఎదుర్కొంటున్న చిల్లర సమస్యను ఆర్‌బీఐ తక్షణమే నివారించాలి. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించాలి. మార్కెట్లో అవసరం ఉన్నంత చిల్లర సరఫరా చేసేందుకు ఆర్‌బీఐ ముందుకు రావాలి. అప్పుడే మార్కెట్లో చిల్లర సమస్య తలెత్తకుండా ఉంటుంది.



ఎమ్మెల్సీ ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం ప్రారంభం

- 25 వరకు ఫార్మ్-12 దరఖాస్తుల స్వీకరణ
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగ పట్టభద్రులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు తమ ఓటు హక్కును బాధ్యతగా ఈ ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం ద్వారా సద్వినియోగించుకోవాలని తెలిపారు. ఈ మేరకు ఎన్నికల విధులు నిర్వహించే పట్టభద్రుల ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫార్మ్-12 ద్వారా ఈ నెల 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రవీందర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సంబంధిత ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో 2,504 గ్రాడ్యుయేట్ ఓటర్స్

- మూడు పోలింగ్ బూత్‌ల ఏర్పాటు - తహసీల్దార్ వెంకటేష్

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్



పాలకుర్తి మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు వేయుటకు గాను రెండు వేల ఐదు వందల నాలుగు మంది గ్రాడ్యుయేట్ ఓటర్స్‌గా నమోదు చేసుకున్నారని తహసీల్దార్ టీ.వెంకటేష్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో గ్రాడ్యుయేట్ ఓటర్స్‌గా నమోదు చేసుకున్న వారిలో డిగ్రీ ఉత్తీర్ణత 2020 1, నవంబర్ కటాఫ్‌గా నిర్ణయించడం జరిగిందన్నారు. ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పట్టా పొందిన వారికి ఎన్నికలలో ఓటు హక్కు ఉండదని కొందరు అపోహ పడుతున్నారని ఇది నిజం కాదన్నారు. ఏ యూనివర్సిటీ ద్వారానైనా డిగ్రీ ఆ పైన విద్యార్హత సాధించి దరఖాస్తు చేసుకున్న వారికి ఓటు హక్కు ఉంటుందని తెలిపారు. 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు మూడు బూతులు ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు.



బాధిత కుటుంబానికి వైస్ ఎంపీపీ సహాయం

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన తాటికాయల రామక్క ఇటీవల మృతిచెందగా, సోమవారం వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మారపాక రాములు, గ్రామాధ్యక్షులు ఎడమ కట్టమల్లు, మారపాక యాదగిరి, బర్మ రాజయ్య, శ్రీనివాస్, మనోహర్, బొంకూరి యాదగిరి, సమ్మయ్య సంపత్, మహేందర్, నాగేష్, పులి రవి, శ్రీనివాస్, అనిల్ పాల్గొన్నారు.

దాతల సహకారంతో సబ్ రిజిస్ట్రార్ భవన నిర్మాణం

నవతెలంగాణ-కొడకండ్ల

కొడకండ్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అసంపూర్తి నిర్మాణంతో ఉండడంతో దాతల సహకారంతో నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని సబ్ రిజిస్ట్రార్ సయ్యద్ అబ్దుల్ హక్కు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణం చుట్టూ ప్రక్కల స్థలం కబ్జాల గురి కావడం జరుగుతుందని కొడకండ్ల కామన్ గ్రూపులో వస్తున్న అపోహాలు అసత్యమని అక్కడ ఎటువంటి కబ్జాల గురి కావడం లేదని అసంపూర్తిగా ఉన్న కార్యాలయం నిర్మాణ పనులను దాతల సహకారంతో కార్యాలయానికి ఉపయోగపడే కొంత మేరకు గదులను గోడలతో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఇట్టి స్థలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి గత ప్రభుత్వంలో కేటాయించడంతోపాటు మరికొంత నిధులను వెచ్చించి కొంతమేరకు పనులు చేయడం జరిగిందని ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రభుత్వం నిధులుమంజూరు చేయడంలో ఆలస్యం అవుతున్నందున లోపల ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇరుకుగా ఉండడంతో దాతల సహకారంతో రెండు మూడు రూములను పూర్తి చేసి అద్దె భవనంలో ఉన్న కార్యాలయాన్ని సొంత భవనం నుంచి మార్చేందుకు కృషి చేయడం జరుగుతుందని సబ్ రిజిస్ట్రార్ తెలిపారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ కొరకు వినతి

నవతెలంగాణ-కేసముద్రం రూరల్



రెవెన్యూ పరంగా అత్యధిక ఆదాయం కలిగిన కేసముద్రం రైల్వే స్టేషన్లో ప్రయాణికుల సౌకర్యార్థం మరో రెండు రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని, ప్రయాణికుల సౌకర్యార్థం కోచ్ డిస్ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలని సోమవారం వివిధ పార్టీలకు చెందిన నాయకుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని చీఫ్ కమర్షియల్ మేనేజర్ ప్రవీణ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇంటర్ సిటీ, మణుగూరు ఎక్స్‌ప్రెస్ హాల్టింగుల కొరకు రైల్వే అధికారులను కలిసి కోరారు. ఈ సందర్భంగా రైళ్ల హాల్టింగు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షులు గుగులోతు వీరు నాయక్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మారుతినేని పాపారావు, సీపీఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు, టౌన్ అధ్యక్షులు రావుల మురళి, జిల్లా నాయకులు బండారు దయాకర్, మండల పార్టీ కోశాధికారి చిదురాల వసంతరావు, కాంగ్రెస్ నాయకులు బనిశెట్టి వెంకటేష్, భూలోక రెడ్డి, జున్నుతుల దేవేందర్ రెడ్డి, పోలేపల్లి పుల్లారెడ్డి. తదితరులు పాల్గొన్నారు

పీహెచ్‌సీకి ప్రహరీ గోడ నిర్మించాలి : సీపీఎం

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

మండలంలోని తాళ్లపూసపెల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని సీపీఎం మండల నాయలకులు గొడిశాల వెంకన్న డిఎంహెచ్ఓ అంబరీషకి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయం పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గుడిసె వెంకన్న, తదితర గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



లోతైన దుక్కులతో భూమిలో తేమ పెరుగుతుంది

- వ్యవసాయ శాఖ అధికారి భూక్య వీరాసింగ్



నవతెలంగాణ-మరిపెడ

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు దుక్కులు దున్నే పనిలో పడ్డారు. లోతైన దుక్కులు దున్నడం వల్ల భూమిలో తేమశాతం పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ మరిపెడ అధికారి భూక్యా వీరా సింగ్ తెలిపారు. సోమవారం మండలంలోని తానంచర్ల, వాల్యతండా గ్రామ శివారులో ఓ రైతు ఎడ్ల నాగలితో దూకి సాగు చేస్తున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తొలకరి వర్షాలు రావడంతో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారని తెలిపారు. లోతైన దుక్కులు దున్నడం వల్ల క్రీము, కీటకాలు, గుడ్లు వాటి లార్వా దశలో ఉండడంతో పురుగులు చనిపోవడం జరుగుతుందన్నారు. వేరు వ్యవస్థ కూడా చాలా వరకు బలం పెరుగుతుందని పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ శాఖ విస్తరణ అధికారుల సూచనలు సలహాలు ద్వారా విత్తనాలు కొనుగోలు చేయాలని దాని ద్వారా రైతుకు నష్టం రాకుండా జరుగుతుందని తెలిపారు.

వీరన్న సేవకు ఐఓబి ఉత్తమ పురస్కారం



నవతెలంగాణ-ఇనుగుర్తి

మండలంలోని అయ్యగారిపెల్లి గ్రామానికి చెందిన భూక్య వీరన్న ఇనుగుర్తి మండలంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో పనిచేస్తున్న ఆయనకు ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ఉత్తమ బిజినెస్ కరస్పాండెంట్ పురస్కారం అందజేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వరంగల్లోని ఇండియన్ ఓవర్సీస్ రీజినల్ కార్యాలయంలో జరిగిన వార్షిక ప్రణాళిక సమావేశంలో ఇనుగుర్తి బ్యాంకులో లోన్ రికవరీ, తదితర ఉత్తమ సేవలు అందించినందుకు రీజినల్ మేనేజర్ నారాయణ ప్రసాద్ నాయక్ ఆదివారం ప్రశంసా పత్రం ఉత్తమ అవార్డు అందించినట్లు వీరన్న తెలిపారు. ఈ పురస్కారంతో మరింత బాధ్యతగా వ్యవహరించి ఎక్కువ సేవలు బ్యాంకు అందజేస్తానని తెలిపారు. నాకు సహకరించిన ఇనుగుర్తి ఐఓబి మేనేజర్ రమేష్, అసిస్టెంట్ మేనేజర్ రవీందర్ నాయక్ బ్యాంకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ బి.కళావతి బాయి



నవతెలంగాణ-మహబూబాబాద్

ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి పేర్కొన్నారు. సోమవారం కంబాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఈదుల పూసలపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి సిబ్బందికి సూచనలు చేశారు. 12 వారాల్లోపు గర్భిణీ స్త్రీలను నమోదు చేయాలని, గర్భిణీ స్త్రీలకు మొదటి, రెండు పరీక్షలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారితో చేయించాలని, మూడు నాలుగు పరీక్షలు జిల్లాలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో ఉన్న స్త్రీ వైద్య నిపుణులతో చేయించుకునేల అవగాహన కల్పించాలని, సి-సెక్షన్ల ప్రసవాలను తగ్గించి, సాధారణ ప్రసవాల సంఖ్య పెంచే విధంగా ప్రజలలో అవగాహన కల్పించాలని, ఔట్ పేషెంట్ సేవలను మెరుగు పరుచాలని ఆమె తెలిపారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్ర పరిధిలో జరుగుతున్న గర్భస్రావాల పైన నిఘా ఉంచాలని సూచించారు. ముఖ్యంగా ముందుకాన్పులో ఆడపిల్ల ఉండి మళ్లీ గర్భం ధరించి 14 వారాల తదుపరి గర్భస్రావం జరిగినట్లయితే అలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంచి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా అసంక్రమిత వ్యాధులైన బీపీ,షుగర్, క్యాన్సర్ వ్యాధుల కొరకు 30 సంవత్సరాల పైబడిన వారిని స్క్రీనింగ్ చేసి అవసరమైన వారికి మందులను అందించాలని, వ్యాధినిరోధక టీకాలు 100 శాతం టార్గెట్ పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఆర్‌బిఎస్‌కే వైద్యాధికారులు, సిబ్బంది తమ యొక్క అడ్వాన్స్ టూర్ ప్రోగ్రాం ప్రకారంగా విధులు నిర్వహించాలని, లేని యెడల తగిన చర్యలు తీసుకుంటానని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మాస్ మీడియా ఆఫీసర్ కొప్పు ప్రసాద్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ సౌజన్య ఆరోగ్య కార్యకర్త గోవిందమ్మ సరిత ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్ రెడ్డిని గెలిపించాలి

నవతెలంగాణ-పెద్దవంగర

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత పట్టభద్రుల ఎన్నికల్లో రెండు సార్లు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలిచారని మళ్లీ ఈ ఉప ఎన్నికలో కూడా సమర్థవంతంగా పనిచేసే రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని టీఎస్జీసీసీ మాజీ చైర్మన్ ధారావత్ గాంధీ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య కోరారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి కరపత్రాలు, డోర్ పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుక రాకేష్ రెడ్డి అని, పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్, మండల ఉపాధ్యక్షుడు కనుకుంట్ల వెంకన్న, మాజీ సర్పంచ్ చింతల భాస్కర్, మండల నాయకులు శ్రీరాం సుధీర్, దుంపల సమ్మయ్య, మండల యూత్ అధ్యక్షుడు కాసాని హరీష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీను, మండల సోషల్ మీడియా అధ్యక్షుడు ఎర్రసాని రామ్మూర్తి, నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మైలపాక అనిల్, యూత్ ప్రధాన కార్యదర్శి కూతురు అనుదీప్, సోషల్ మీడియా ఉపాధ్యక్షుడు దేశెట్టి వెంకటేష్, మహంకాళి దయాకర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలుక బిక్షపతి, శంకర్, పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దవంగరలో పట్టభద్రులు 1348 మంది...

మండలంలోని అన్ని గ్రామాల్లో పట్టభద్రుల ఓటర్ల తుది జాబితాను అధికారులు ప్రకటించారు. పెద్దవంగరలో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పురుషులు 920 మంది ఓటర్లు, స్త్రీలు 428 మంది ఓటర్లు ఉండగా మొత్తం 1348 మంది ఓటర్లు తమ ఓటు హక్కును మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో వినియోగించుకునేందుకు అధికారులు పూర్తి ఏర్పాటు చేశారు. మే 27 న ఉదయం 8 గంటల నుంచి సా యంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. ఇక జూన్ 5న ఫలితం తేలనుంది. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీమధ్యనే పోటీ ఉండగా కాంగ్రెస్ నుండి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుండి ఏనుగుల రాకేష్ రెడ్డి, బీజేపీ నుండి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి బరిలో నిలిచారు. గెలుపుపై ఎవరికి వారు ధీమాతో ఉన్నారు. కాగా మండలంలో 1348 మంది ఓటర్లు మాత్రమే ఉండగా, ఆయా గ్రామాల్లోని పార్టీ ఎన్నికల ఇన్చార్జిలు ఓటర్లకు ఫోన్లు చేస్తూ, ఓటు వేయాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

- పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాన్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కంటాయపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ మహిళా కార్యకర్త డోనుక కొమరమ్మ ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతిచెందగా విషయం తెలుసుకొని వారి కుమారుడు అయిన డోనుక కొమురయ్య, వారి కుటుంబ సభ్యులను హనుమాన్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని వారికి అన్నివేళలా సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు సుంచు సంతోష్, పిఎసిఎస్ చైర్మన్ డిసిసిబి డైరెక్టర్ కాకిరాల హరి ప్రసాద్ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెదగాని సోమన్న గౌడ్, కిషన్ యాదవ్, మోకాటి వెంకన్న కుమారస్వామి పాల్గొన్నారు.

అశోక్ మృతదేహంతో హాస్పిటల్ ఎదుట కుటుంబ సభ్యులు ఆందోళన



నవతెలంగాణ-గార్ల

ఆదివారం రాత్రి జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో ఉన్న ఇస్లావత్ అశోక్‌ను స్థానిక సిహెచ్‌సి హాస్పిటల్‌కు తీసుకురాగా హాస్పిటల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో అశోక్ మృతి చెందాడని అశోక్ బంధువులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ఆసుపత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు.ఈ ఆందోళనకు మద్దతు ప్రకటించిన సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవడం ఉన్న ఒకరిద్దరూ సైతం సాయంత్రం సమయంలో అందుబాటులో లేకపోవడం వల్ల అశోక్‌కు సకాలంలో వైద్యం అందకపోవటంతో మృతి చెందడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక హాస్పిటల్‌లో అన్ని రకాల వైద్యులు అందుబాటులో ఉండాలని గతంలో మంత్రులకు, ఎమ్మెల్యేలకు, జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన, ఎన్ని ఆందోళన చేసిన పట్టించుకోకపోవడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా సూపరింటెండెంట్‌తో ఫోన్‌లో మాట్లాడి హామీ ఇవ్వడంతో గార్ల-బయ్యారం సిఐ రవి కుమార్ చొరవతో ఆందోళన విరమించారు. ఆదివారం రాత్రి తిర్లాపురం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అశోక్ భార్య ప్రమీలా ఫిర్యాదు మేరకు మృతికి కారణమైన ద్విచక్ర వాహనదారుడు పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ విరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పార్లమెంట్ ఓట్ల లెక్కింపు పకడ్బందీగా చేయాలి

- ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట చర్యలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



నవతెలంగాణ-మహబూబాబాద్

పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ నోడల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాలు నందు అదనపు కలెక్టర్లు లోకల్ బాడీస్, రెవెన్యూ లెనిన్ వత్సల్ టొప్పో, డేవిడ్‌లతో కలిసి సంబంధిత నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి అద్వైత్ కుమార్ సింగ్ ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల వారీ పోలింగ్ కేంద్రాల సంఖ్యను బట్టి ఓట్ల లెక్కింపు టేబుల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు సిబ్బందిని నియమించాలన్నారు. వారికి అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు టేబుల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు హాళ్లలో బారికేడింగ్ పనులు చేపట్టాలని, సిబ్బంది పోలింగ్ ఏజెంట్లు కౌంటింగ్ హాల్ లోనికి ప్రవేశ మార్గాలు, సూచికల బోర్డ్లు ఏర్పాటు చేయాలని, పాత్రికేయుల కొరకు మీడియా సెంటర్‌లో అవసరమైన చర్యలు చేపట్టాలని, కౌంటింగ్ సిబ్బంది వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని పరిశీలించాలని, అధికారుల మొబైల్ ఫోన్స్ డిపాజిట్ కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

మే 27 న జరగనున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉపఎన్నికల పోలింగ్‌కు జిల్లాలోని 34,933 ఓటర్లకు గాను 36 పోలింగ్ స్టేషన్లలో అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని, సెక్టార్ అధికారులు ప్రతీ పోలింగ్ స్టేషన్‌ను తనిఖీ చేయాలని ఏవైనా సమస్యలు ఉంటే త్వరగా పరిష్కరించాలని అన్నారు. జిల్లాలో ఉన్న 58 బ్యాలెట్ బాక్స్‌లను పోలింగ్‌కు సిద్ధం చేయాలని, తొర్రూరు జెడ్‌పిహెచ్‌ఎస్, మహబూబాబాద్ ఫాతిమా హైస్కూలు నందు ఏర్పాటు చేసే స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీఓలుఎల్.అలివేలు, నరసింహారావు, డిప్యూటీ సీఈఓ నర్మద, మత్స్య శాఖ అధికారిణి నాగవాణి, డిఏఓ హరిప్రసాద్, సిపిఓ సుబ్బారావు, డిడి గ్రౌండ్ వాటర్ అధికారి సురేష్, ఏడి సర్వే ల్యాండ్ అధికారి నరసింహమూర్తి, ఎంఆర్‌ఓలు సైదులు, భగవాన్ రెడ్డి, ఎలక్షన్ సూపరింటెం డెంట్ పవన్ కుమార్, మాస్టర్ ట్రైనర్స్ రాములు, ప్రవీణ్, ఎన్నికల విభాగం సిబ్బంది గణేష్, సందీప్, రంజిత్ పాల్గొన్నారు.

సుందరయ్య స్ఫూర్తితో ప్రజా పోరాటాలు

- ఉపాధి హామీ అవకతవకలపై మండల కేంద్రాల్లో ఆందోళనలు
- వ్యకాస జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య



నవతెలంగాణ-మరిపెడ

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఉపాధి చట్టం నిర్వీర్యం అవుతుందని ఉపాధి హామీ చట్ట రక్షణకై ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య అన్నారు. సోమవారం సుందరయ్య 39వ వర్ధంతి వారోత్సవాల్లో భాగంగా మరిపెడ మండలం బాల్ని ధర్మారం, తండ ధర్మారం గ్రామాల్లోని ఉపాధి పని ప్రదేశాలలో ఘనంగా నిర్వహించారు. అనంతరం అల్వాల వీరయ్య మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో ఉపాధి చట్టానికి బడ్జెట్లో నిధులు తగ్గించి అనేక సవరణలు చేసి నిర్వీర్యం చేసిందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవడానికి కోసం మే 31న జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మే 20 నుండి జూన్ 5 వరకు జిల్లా వ్యాప్తంగా ఉపాధి పర్యటనలు విస్తృతంగా ఉపాధి హామీలు జరుగుతున్న అవకతవకలను తెలుసుకొని పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. జూన్ 10న కలెక్టరేట్ కార్యాలయం ముందు ఉపాధి కూలీలతో ఆందోళన చేస్తామని ఆయన ప్రకటించారు. అప్పటికి ప్రభుత్వం దిగి రాకపోతే ఉధృత ఉద్యమాలు నిర్వహిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొని నిర్ణయాల వల్ల ఉపాధి కూలీల నోట్లో మట్టి పడిందని అన్నారు. జూలై మాసంలో వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని జిల్లావ్యాప్తంగా కూలి పోరాటాలు నిర్వహిస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాణాల రాజన్న, సంఘం బాల్ని ధర్మారం, తండ ధర్మారం అధ్యక్షులు కుమ్మరికుంట్ల వెంకన్న, మూడు శోభన్, గ్రామ నాయకులు గట్టుకుల వెంకటరెడ్డి, గోలి గోపయ్య, మొక్కల పిచ్చయ్య, గుగులోతు అర్జున్, భయ్యా నాగమణి, పిచ్చమ్మ, నరసింహ, బాల్య నాయక్, తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ భూములను కాపాడాలి

- ఎండోమెంట్ శాఖ పరిశీలకులు నందనం కవిత

నవతెలంగాణ-మరిపెడ

మండలంలోని అబ్బాయి పాలెం గ్రామంలో శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయ భూములను కాపాడుకోవాలని ఆమె గ్రామస్తులకు సూచించారు. సోమవారం దేవుని భూముల కౌలు వేలంపాటకు హాజరైన ఆమెకు ఆలయ పూజారి ప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన వేలంపాటలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 285 సర్వే నెంబర్లు 14 ఎకరాల 25 గుంటలు, 290 సర్వే నెంబర్లు ఏడు ఎకరాలు, 291 సర్వే నెంబర్లు 7ఎకరాల5 గుంటలు, 292, 294, 295, 296 సర్వే నెంబర్లలో ఆరు ఎకరాల రెండు గంటలు వ్యవసాయ భూమి కలదన్నారు. అయితే ఈ భూములలో గతంలో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు మట్టి తవ్వకాలు, జరిపారని, భూములను కబ్జాకు గురి అలాంటి చేసినట్లయితే దేవదాయ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. దేవాదాయ శాఖ రికార్డుల ప్రకారంగా భూమి ఉండాలని అతి త్వరలో రీ సర్వే చేయిస్తామని తెలిపారు. ఈ భూములను రక్షించుకునే బాధ్యత గ్రామస్తులదేనని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మరిపెడ ఈవో కె.వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ మార్క్ శేఖర్, అర్చకులు ప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



దేవుని భూమి కౌలు వేలం పాట...

శ్రీ ఆగస్తేశ్వర స్వామి ఆలయం సంబంధించిన భూములను దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో గ్రామస్తులు వేలం పాడారు. 27 ఎకరాల భూమికి లక్ష 18 వేల రూపాయలను గ్రామానికి చెందిన రైతులు కౌలుకు వేలంపాట పాడారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డివిజనల్ పరిశీలకులు నందనం కవిత, ఈవో కె.వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ మార్క్ శేఖర్, అర్చకులు ప్రసాద్ శర్మ, గ్రామస్తులు ఒంటి కొమ్ము సుధాకర్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి చంద్రారెడ్డి, తల్లాడ వెంకట రామారావు, రావుల వెంకటరెడ్డి, కురియాల రాములు, జినక వీరయ్య జిన్న లచ్చయ్య, రాయల రవి, అలవాల యాదగిరి, జినక ఉపేందర్, పోలేపొంగు ఎల్లయ్య, మేస్త్రి వెంకయ్య, జినక ఉప్పలయ్య, జిన్నా ఎల్లయ్య,జినక వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరుపాటి వెంకటరెడ్డి, ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి నవీన్ రావు తెలిపారు. మండల కేంద్రంలో ఆ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి సోమవారం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకొని సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్‌కు మహబూబాబాద్ నియోజకవర్గం పరిధిలోని ప్రతీ గ్రామం, ప్రతీ తండాను అభివృద్ధి చేసిన ఘనత దక్కిందన్నారు. కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చి ప్రతి గ్రామంలో సీసీ, లింకు రోడ్లు వేయించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు బత్తిని అనిల్ గౌడ్, శ్రీరామగిరి పీఏసీఎస్ వైస్ చైర్మన్ బోజ్యా నాయక్, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు భీముడు, మాజీ సర్పంచ్ బిక్కు నాయక్, నాయకులు వెన్నాకుల శ్రీనివాస్, యాసం రమేష్, పులి రామచంద్ర, గొట్టిముక్కుల బాలాజీ నాయక్, వెంకటేశ్వర రెడ్డి, సలుగు శ్రీనివాస్, కొమ్ము అనిల్, మంద అశోక్, బొల్లు మురళి, కారం ప్రశాంత్, పిడుగు యాకన్న ,వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే కూలీలకు సౌకర్యాలు

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు సౌకర్యాలు కల్పించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించడం వలన కూలీలకు అధికారులు కనీస సౌకర్యాలు కల్పించారని సీపీఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ అన్నారు. సోమవారం మండల మండల కేంద్రంలో ఒక పత్రిక ప్రకటన విడుదల చేస్తూ అమీనాపురం గ్రామంలో ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రదేశంలో కనీస సౌకర్యాలు లేకపోవడం వలన కూలీలు ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో సిపిఐ ఆధ్వర్యంలో పని ప్రదేశం దగ్గర వెళ్లి కూలీల సమస్యలను తెలుసుకొని వారి సమస్యల పరిష్కారం కోసం అధికారుల దృష్టికి పత్రికల ద్వారా తెలపడం జరిగిందన్నారు.

ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీలకు సౌకర్యాలు తక్షణమే కల్పించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిక చేసిన నేపథ్యంలో స్పందించిన గ్రామపంచాయతీ కార్యదర్శి కందిపాటి శిరీష, ఫీల్డ్ అసిస్టెంట్ చీపిరి మల్లయ్యలు కూలీలకు సౌకర్యాలు కల్పించారన్నారు. భవిష్యత్తులో కూలీలకు ఏ సమస్యలు వచ్చిన సిపిఐ పార్టీ వారికి అండగా ఉండి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందన్నారు. కనీససౌకర్యాలు కల్పించేందుకు కృషి చేసిన సిపిఐ పార్టీకి, అధికారులకు కూలీలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి దాసరి లింగస్వామి పాల్గొన్నారు.

పోలీసులు చూసి చూడనట్లు వదిలేస్తున్నారు

- ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి నవీన్ రావు
- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరుపాటి వెంకటరెడ్డి

నవతెలంగాణ-నెల్లికుదురు

బీఆర్ఎస్‌లో ఒకరిద్దరు ఇసుక తోలుకుంటే పోలీసులు ట్రాక్టర్లను తీసుకెళ్లి రోజుల కొద్దీ నిర్బంధిస్తున్నారని అలానే కాంగ్రెస్‌కు చెందినవారు ఇసుకను తోలుకుంటే అధికారులు చూసి చూడనట్టుగా పోలీసులు వ్యవహరస్తున్నారని ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి నవీన్ రావు, ఆ పార్టీ మండలాధ్యక్షుడు అరుపాటి వెంకటరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయంలో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌కు చెందిన వారు కొంతమంది అక్రమంగా ఇసుకను రవాణా చేస్తుంటే వారిని అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందినవారు ఇసుకను తోలుకుంటే వారిని తీసుకెళ్లి మరి ట్రాక్టర్లను రోజులకొద్దీ నిర్బంధించి వారిని ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. అధికారులు మా పార్టీ నాయకులను ఇబ్బందులు పెడుతుంటే మా దాంట్లో ఒకరిద్దరు ఇసుక తోలుకునేవారు కాంగ్రెస్ పార్టీకి వెళ్లిపోయారని తెలిపారు. మీరు ఎందుకు కాంగ్రెస్ పార్టీకి వెళ్లిపోయారు అని వారిని అడిగితే ఈ సమాధానం ఇచ్చారని తెలిపారు. ఇలా చేస్తే తహసీల్దార్ కార్యాలయం ముందు పార్టీ నాయకులతో కలిసి ఆందోళన చేస్తామని అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని తెలిపారు. పేదలను పట్టించుకోవడంలో విఫలం చదువుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, శ్రీనివాస్, మురళి, భీముడు, అనిల్, భోజియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ పరామర్శ, ఆర్థిక సహాయం



గార్ల : గత అయిదు రోజుల క్రితం జరిగిన దాడిలో తీవ్ర గాయాలై జిల్లా ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మండలంలోని ముల్కనూరు పంచాయతీ గుంపెళ్లగూడెం గ్రామానికి చెందిన పిట్టల సైదులును మాజీ ఎంపిపి, ముల్కనూరు ఎంపిటిసి మాళోత్ వెంకట్ లాల్ సోమవారం పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు. సైదులుకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో విశ్రాంత ఆర్మీ ఉద్యోగి అయితా కిరణ్ కుమార్ ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడిని అరికట్టాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గుగులోతు సూర్య ప్రకాష్



నవతెలంగాణ-మహబూబాబాద్

నూతన విద్యా సంవత్సరంలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాల కళాశాలలో ఫీజులో దోపిడీని అరికట్టాలని అదే విధంగా ఫీజులో నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. సోమవారం మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని సంఘం కార్యాలయంలో పట్టణ నాయకులు సింహాద్రి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు గుగులోతు సూర్య ప్రకాష్ హాజరై మాట్లాడారు. జిల్లాలో అనుమతులు లేకుండా కొన్ని బడా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు చేస్తూ అడ్మిషన్లు చేయడమే కాకుండా రిజిస్ట్రేషన్ ఫీజులు సైతం భారీ మొత్తంలో వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అదేవిధంగా ఫీజులు హద్దు లేకుండా మితిమీరి పెంచుతున్నారని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫీజుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈ సంవత్సరం పూర్తి చేసిన పదో తరగతి విద్యార్థుల దగ్గర నుండి టిసి, స్టడీ సర్టిఫికెట్, బోనఫైడ్ రూపంలో పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతోపాటు జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కీంలో సీట్లు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులకు 25శాతం ఉచితంగా విద్యను అందించాలని అన్నారు. ఈ సమావేశంలో పట్టణ నాయకులు సింహాద్రి, తరుణ్, పరమేష్, ప్రవీణ్, దినేష్, కార్తీక్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఉపాధి బిల్లులు వెంటనే చెల్లించాలి



నవతెలంగాణ-గార్ల

పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వంగూరి పెద్ద వెంకటేశ్వర్లు, టిజిఎస్ జిల్లా కార్యదర్శి భూక్య హరి నాయక్ డిమాండ్ చేశారు. మండలంలోని ముత్తితండా గ్రామంలోని బొడ్రాయి కుంట చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం వ్యకాస, తెలంగాణ గిరిజన సంఘం అధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీల కు వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే వరకు పనులు కల్పించాలని, పని ప్రదేశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జాబ్ కార్డులకు ఆధార్ కార్డులకు లింక్ లేక అనేక మంది ఉపాధి హామీ కూలీలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఆధార్ కార్డు అప్ డేట్స్ టెక్నికల్ సమస్యలను ఉన్నతాధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకొని సుందరయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కూలీలు బిక్కు, వీరన్న, రామూర్తి, నీలా, వెంకన్న పాల్గొన్నారు.

జీపీ సిబ్బంది వేతనాలు చెల్లించాలి : కొత్తపల్లి రవి

నవతెలంగాణ-తొర్రూరు

రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 13 వేల గ్రామపంచాయతీలలో 60 వేల మంది సిబ్బంది పని చేస్తున్నారని వారికి వేతనాలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. సోమవారం స్థానిక ఐఎఫ్టియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకటో తారీఖున ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నానని గొప్పలు చెప్పుకుంటున్నా రాష్ట్ర ముఖ్యమంత్రికి గత ఐదు, ఆరు నెలలుగా జీతాలు రాని గ్రామపంచాయతీ సిబ్బంది వేతన బాధలు కనిపించడం లేదా..? అని ప్రశ్నించారు. గ్రామాలలో కోట్లాది మంది ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న గ్రామపంచాయతీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించటం లేదని అన్నారు. కొన్ని జీపీలలో సంవత్సర కాలంగా, మరికొన్ని జీపీలలో ఐదారు నెలలుగా వేతనాల బకాయిలతో కార్మికులు అర్ధాకలితో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిపి కార్మికులు అత్యధిక మంది దళిత, గిరిజన, అట్టడుగు వర్గాల వారేనని వారి బాగోగులను రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తే ఐక్యంగా పోరాటం తప్పదని అన్నారు. మీ ఎన్నికలు సరే మా జీతాల మాటేమిటి అని రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వమే కల్పిస్తుందని అన్నారు. ఎన్నికల కోడ్‌కు సంబంధం లేకుండా ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చినట్లుగా గ్రామపంచాయతీ సిబ్బందికి వేతనాలు వెంటనే విడుదల చేయకపోతే ఐక్య పోరాటాలకు సిద్ధమవుతున్నామని తెలిపారు. కనీస వేతనం 26,000 నిర్ణయించి పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి మల్టీపర్పస్ వర్కర్ జీవోను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాడియ బీకు, మండలాధ్యక్షుడు గుండాల సోమనసయ్య, ఉపాధ్యక్షుడు పగిడి పాల ప్రమోద్, మండల నాయకులు బాదావత్ రాజేందర్, మాలోత్ యాకన్న,జాటోతు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT MAHABUBABAD
I.A.NO.427 OF 2023
IN O.S.NO. 39 OF 2023

Between:
Veludandi Ramesh .... Petitioner / Plaintiff
And
Bairu Chennaiah and others ...Respondents/Defendants

To. R-
4. Bairu Ramesh, S/o. Chennaiah, Age: 43 Years, Occ: Agriculture,
5. Sura Mallaiah, S/o. Iddaiah, Age: Adult, Occ: Agriculture,
Both are residents of Chinna nagaram Village, Nellikuduru Mandal (Previously), at present Inugurthy Mandal, Mahabubabad District,
6. Vem Ramachandra Reddy, S/o. Venkata Narasimha Reddy, Age:50 Years, Occ: Agriculture, R/o. H.No.2-6-1341/2, Bhavani Nagar, Hanamkonda Town and District.

WHERE AS THE above named petitioner/Plaintiff has made an application to this court under Or 39 rule 1 and 2 of C.P.C to grant Temporary Injunction

The above I.A is posted for your appearance on **11-06-2024 at 10.30 AM** before the Honourable court. As such you may be appeared either in person or through your counsel before the Honourable court on the above date. If you are failed to appear on the said date the matter will be decided according to law.

// By the order of the Court //
T. NAGESH KUMAR
ADVOCATE
MAHABUBABAD TOWN AND DISTRICT.
Date:20-05-2024

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT MAHABUBABAD
O.S.NO. 39 OF 2023

Between:
Veludandi Ramesh ...Plaintiff
And
Bairu Chennaiah and others ...Defendants

To, D-
4. Bairu Ramesh, S/o. Chennaiah, Age: 43 Years, Occ: Agriculture,
5. Sura Mallaiah, S/o. Iddaiah, Age: Adult, Occ: Agriculture,
Both are residents of Chinna nagaram Village, Nellikuduru Mandal (Previously), at present Inugurthy Mandal, Mahabubabad District,
6. Vem Ramachandra Reddy, S/o. Venkata Narasimha Reddy, Age:50 Years, Occ: Agriculture, R/o. H.No.2-6-1341/2,Bhavani Nagar,Hanamkonda Town and District.

The above named plaintiff has filed the above suit against you before the above court for **Declaration, Permanent Injunction and Ratification of Revenue entries,** The above suit is posted for your appearance on **11- 06-2024 at 10.30 A.M** before the Honourable court. As such you may be appeared either in person or through your counsel before the Honourable court on the above date. If you are failed to appear on the said date the matter will be decided according to law.

//By the order of the Court//
T. NAGESH KUMAR
ADVOCATE
MAHABUBABAD TOWN AND DISTRICT.
Date:20-05-2024

వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలి

- ఇన్‌చార్జి వైద్యాధికారి సందీప్



నవతెలంగాణ-మల్హర్‌రావు

మండల కేంద్రమైన తాడిచెర్ల లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని డీడీఓ,ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి వైద్యాధికారి సందీప్ ఆదేశించారు. సోమవారం ఆరోగ్య కేంద్రం ఆవరణలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆరోగ్య కేంద్రంతోపాటు గ్రామాల్లో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాల్లో సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రాజు, హెల్త్ సూపర్‌వైజర్స్, హెల్త్ అసిస్టెంట్స్, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ స్థాయి స్టడీ ప్రోగ్రాం కోసం ఏఎస్ఓల రాక..



నవతెలంగాణ-గణపురం

గ్రామీణస్థాయి విషయాలను తెలుసుకోవడానికి మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం నుండి సెంట్రల్ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ చెల్పూర్ గ్రామ పంచాయతీకి ఐదు రోజుల నిమిత్తం సోమవారం వచ్చారు. గ్రామీణస్థాయి వాతావరణం, పరిసరాలు ప్రజలతో మమేకం అవ్వడం, వారి జీవనశైలి స్థితిగతులను తెలుసుకోవడం ఆర్థిక అసమా నతలు తదితర అంశాలపై, ఆరోగ్యం, విద్య వంటి అంశాలపై అధ్యయనం చేయడానికి ఆరుగురు బృంద సభ్యులు వచ్చారు. ఏఎస్ఓలు పాయల్, మేఘా భారతి, రిషి రాజ్, పూజా సింగ్, శివం కందేల్వాల్, జై ప్రకాష్ వచ్చారు. వారివెంట ఎంపీడీవో భాస్కర్, పంచాయతీ కార్యదర్శి హరిచంద్ర రెడ్డి, ముక్కెర హేమంత్, తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో దళారులు ?

- తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామంటూ రైతులకు ఎర
- దళారుల చేతిలో ప్రభుత్వ బార్దాన్ !
- క్వింటాల్‌కు 4 నుంచి 8 కిలోల కోత !
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-మల్హర్‌రావు

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలని, అకాల వర్షాలతో తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని తాడిచెర్ల ప్రాథమిక సహకార సంఘం, డీసీఎంఎస్ ద్వారా మండలంలో 22 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. రైతులు ధాన్యాన్ని అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల్లో పోశారు. అయితే రైతుల ధాన్యం సిబ్బంది ఆలస్యంగా విక్రయిస్తున్న నేపథ్యం, మరోవైపు ప్రకతి పగబట్టడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోస్తూ తిప్పలు పడుతున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు ప్రయివేటు వడ్ల వ్యాపారులు కొనుగోలు కేంద్రాల్లోకి చొరబడి తక్కువ ధరకు ధాన్యం సేకరించడమే కాకుండా తూకంలో మోసం చేస్తూ, గొలుసు కాంటాలతో అందినకాడికి దండుకుంటున్నట్టు ఆరోపణలొస్తున్నాయి. దళారులకు ప్రభుత్వం సరఫరా చేసే గన్ని సంచులు సైతం కొనుగోలు కేంద్రాల నుంచే సరఫరా అవడం మరో విశేషం. ఇదంతా సొసైటీ సిబ్బంది కనుసైగలోనే నడుస్తున్నట్టు ఆరోపణలొస్తున్నాయి. అయితే సంబంధించిన ఉన్నతాధికారులు విచారణ చేపడితే నిజాలు బయటపడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. మండలంలోని తాడిచెర్ల, పెద్దతూండ్ల, గాదంపల్లి, అడ్వాలపల్లి, కొండం పేట, ఎడ్లపల్లి, రుద్రారం, కొయ్యూర్, వళ్లెంకుంట గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల వద్దకు



వ్యాపారులు మధ్యాహ్నం, రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా చేరుకొని మీ ధాన్యాన్ని క్వింటాలుకు రూ.1800కు కొనుగోలు చేస్తామని, డబ్బులు నగదు ఇస్తామని రైతులను ప్రలోభాలకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ప్రయివేటు దళారులు ప్రతి సంవత్సరం కొనుగోలు కేంద్రాల పరిధిలోకి వెళ్లి ధాన్యం సేకరించడం పరిపాటిగా మారింది. ప్రభుత్వం క్వింటాలకు గ్రేడ్-ఏ ధాన్యంకు రూ.2,180, గ్రేడ్ బికి రూ.2,150 మద్దతు ధర ఇస్తోంది.



దీన్ని బట్టి చూస్తే రైతు క్వింటాల్ కు రూ.300 నుంచి రూ.400 వరకు, అలాగే తూకంలో గొలుసు కాంటాలు పెట్టడమే కాక ఒక సంచికి 2 నుంచి 4 కిలోలు అదనంగా తూకం వేయడంతో రైతులు నష్టపోయే అవకాశం ఉంది. కొనుగోలు కేంద్రాల వద్దకు దళారులు రావద్దని ఆదివారం రాత్రి తాడిచెర్లలో రైతులు దళారితో వాగ్వాదానికి దిగినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరించడానికి పంపిన బార్దన్ సైతం తాడిచెర్లలోని ఓ కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు ప్రయివేటు దళారులకు సరఫరా చేస్తున్నట్లుగా బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎది ఏమైనా రైతుల నట్టేట ముంచుతున్న దళారులపై, వారికి సహకరిస్తున్న కొనుగోలు సిబ్బందిపై ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేసి చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

తక్కువ ధరకు వ్యాపారులు అడుగుతున్నారు

పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో పోస్తే కాంట పెట్టడానికి ఆలస్యం కావడం,మరోవైపు అకాల వర్షాలకు భయాందోళనకు గురై ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయిస్తే క్వింటాలు కు రూ.400 తక్కువగా అడుగుతున్నారు.ఇలా 30 క్వింటాళ్లు విక్రయిస్తే రూ.12వెలు నష్టం జరిగే అవకాశం ఉంది.

-బాణయ్య, రైతు

వ్యాపారుల బెడద

నిత్యం ప్రయివేటు వ్యాపారులు రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం విక్రయించడానికి మండలంలో ఎక్కువగా తాడిచెర్ల, పెద్దతూ%శీ%డ్ల,కొయ్యూర్ కొనుగోలు కేంద్రాల చుట్టే తిరుగుతున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో దళారుల బెడద పెరిగిపోయింది. ప్రభుత్వం క్వింటాలు కు రూ.2,180 ప్రకటిస్తే ప్రయివేటు వ్యాపారులు మాత్రం రూ.1800 లకే విక్రయిస్తున్నారు.

- అక్కల బాపుయాదవ్, రైతు సంఘం నాయకుడు

ప్రభుత్వ భూముల ఆక్రమణ ?

మత్స్యకారుల పొట్టగొడుతున్న వైనం

పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-చిట్యాల

ప్రభుత్వ భూములను, చెరువులను ఆక్రమిస్తూ అక్రమంగా బిల్డింగులు నిర్మిస్తూ మత్స్యకారుల పొట్ట కొడుతున్న పరిస్థితి నెలకొంది. సదరు రెవెన్యూ అధికారులు సైతం పట్టించుకోకపోవడం గమనార్హం. ఇందుకు జయశంకర్-భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలమే నిదర్శనం. మండలంలోని ఎల్లేటి రామాయపల్లె గ్రామ శివారులోని కరుణాలకుంట భూమిని భూ కబ్జాదారులు అక్రమంగా ఆక్రమించుకున్నారు. చిట్యాల గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ భూములు కబ్జాదారులు అక్రమంగా ఆక్రమించుకొని ఏకంగా బిల్డింగులు నిర్మిస్తున్నారు. చిట్యాల పెద్ద చెరువు చిట్యాల గ్రామ శివారు మామిడికుంట చెరువులో 42 ఎకరాలు ఉండగా 20 ఎకరాలు ఆక్రమణకు గురైనట్టు ఆరోపణలొస్తున్నాయి. కుమ్మరికుంట ఇద్రపురంకుంటలోనూ ప్రభుత్వ భూములు ఆక్రమిస్తూ నీళ్ల లేకుండా చేస్తూ మత్స్యకారుల పొట్టగొడుతున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూముల్ని కాపాడాల్సిన బాధ్యత పాలకులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి రెవెన్యూ అధికారిలకు స్పష్టమైన ఆదేశాలు జారీచేసి ప్రభుత్వ భూములను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ భూమి కాపాడాలి



చిట్యాల గ్రామపంచాయతీ పరిధి కరుణాలకుంట, మామిడికుంట, చెలకుంట ఆక్రమణకు గురవుతున్నది. దీంతో మత్స్యకారులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి చేపల పెంపకాలపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న మత్స్యకారులకు ప్రభుత్వ భూమి కాపాడుతూ వారికి సహాయం చేయాలి. దీంతో మత్స్యకారుల కుటుంబాలకు జీవనోపాధి కలుగుతుంది. భూమిని ఆక్రమించిన భూ కబ్జాదారులపై తగిన చర్యలు తీసుకోవాలి.

- ఫిషరీస్ సొసైటీ ఉపాధ్యక్షులు గుండా రవీందర్, చిట్యాల

యూనియన్ బ్యాంకుకు ఆన్లైన్ కష్టాలు !

3 రోజులుగా పనిచేయని బ్యాంక్ సేవలు


ఆందోళనకు దిగిన లబ్ధిదారులు



నవతెలంగాణ-గణపురం

గణపురం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకుకు ఆన్లైన్ కష్టాలు మొదలయ్యాయి సోమవారం యూనియన్ బ్యాంకు కు నో నెట్ వర్క్ అని బోర్డు పెట్టడంతో లబ్ధిదారులు ఆందోళనకు దిగారు శుక్రవారం శనివారం రెండు రోజులపాటు కరెంటు లేకపోవడం డబ్బులు కూడా లేకపోవడంతో లబ్ధిదారులు గత నాలుగు రోజుల నుండి డబ్బులు వేసేవారు తీసేవారు నానా ఇబ్బందులు పడ్డారు. శుక్ర, శనివారాల్లో కరెంటు లేకపోవడం వల్ల బ్యాంకు సిబ్బంది లబ్ధిదారులను ఆదివారం సెలవు సోమవారం బ్యాంకుకు రావాలని చెప్పడంతో లబ్ధిదారులు వెళ్లిపోయారు. మూడు రోజులుగా డబ్బులు డ్రా చేసుకునేందుకు ఎదురు చూస్తున్న లబ్ధిదారులు వారి అవసరాలు ఒడ్డెక్కించుకునేందుకు భారీ సంఖ్యలో సోమవారం ఉదయం బ్యాంకుకు చేరుకున్నారు. బ్యాంకులో ఆన్లైన్ పనిచేయకపోవడంతో నో ఆన్లైన్ అని బోర్డు పెట్టడంతో లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడి ఉదయం నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎదురుచూసి వెళ్లిపోయారు. మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు లో ఆంధ్ర బ్యాంకు పేరు ఉన్న సమయంలో జనరేటర్‌ను ఏర్పాటు చేశారు, యూనియన్ బ్యాంక్ అనే పేరు మార్పిడి అయినప్పటి సమయం నుండి బ్యాంకులో ఉన్న జనరేటర్ ను జోనల్ ఆఫీస్ వారు తరలించినట్లు సమాచారం. కాగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంకుకు ఘనపురం మండల వాసులే కాకుండా భూపాలపల్లి మండలం శ్యామ్ నగర్. వెంకటాపురం మండలం వెలుతుర్లపల్లి. రామంజాపురం. గ్రామాల ప్రజలకు కూడా ఈ బ్యాంకులో ఖాతాలు ఉన్నాయి ఇంత పెద్ద బ్యాంకు కు జనరేటర్ లేక పోవడం విడ్డూరంగా ఉంది. ఏది ఏమైనా యూనియన్ బ్యాంకు తో ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి యూనియన్ బ్యాంకు జనరేటర్ ఏర్పాటు చేసి లబ్ధిదారులకు మంచి సేవలు అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

'డీలర్ల'కు అవగాహనా సదస్సు



నవతెలంగాణ-రేగొండ

మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో సోమవారం మండలంలోని విత్తన ఎరువుల పురుగుల మందుల డీలర్లకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో వాసుదేవ రెడ్డి హాజరై మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు విత్తన లాట్ నెంబర్ రాసి రైతు సంతకంతో బిల్లు విధిగా ఇవ్వాలన్నారు. రోజువారి విత్తన, ఎరువుల పురుగుమందుల నిలువలు స్టాక్ రిజిస్టర్‌లో విధిగా నమోదు చేసుకోవాలన్నారు. ధరల పట్టిక స్టాక్ నిలువ పట్టికలను రోజువారిగా నమోదు చేయాలన్నారు. ఎరువులు కొనుగోలు చేసే రైతుల ఆధార్ నమోదుతో వేలిముద్రల ద్వారా ఈ-పాస్ యంత్రం ద్వారా మాత్రమే ఎరువుల అమ్మాలని అన్నారు. విత్తన నిలువలను ఆన్లైన్లో ఫార్మ్ డి లో ప్రతినెల 5వ తేదీ లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. డీలర్స్ అందరూ చట్టం ప్రకారం వ్యాపారం చేయాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు.ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు వడ్ల కొండ మల్లికార్జున్, వివిధ గ్రామాల ఫర్టిలైజర్స్ డీలర్స్, తదితరులు పాల్గొన్నారు.

నివేదికలు అందజేయాలి : జిల్లా కలెక్టర్



నవతెలంగాణ-భూపాలపల్లి

పాఠశాలల్లో మరుగుదొడ్లపై నివేదికలు అందజేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఐడీఓసీ కార్యాలయంలోని మినీ సమావేశపు హాలులో విద్యా, పంచాయతీరాజ్, డీఆర్డీఓ అధికారులతో సమావేశమై ఆయన మాట్లాడారు. జిల్లాలో 13 పాఠశాలలో మంచి నీరు సౌకర్యాలు లేనట్లు గుర్తించామని, 61 పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మించాల్సి ఉందన్నారు. రెండు పాఠశాలలో మైనర్ మరమ్మతులు చేపట్టాల్సి ఉందని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ఉపాధి హామీ ద్వారా నిర్మాణానికి 42 మరుగుదొడ్లకు అనుమతులు మంజూరు చేశామని, నెల రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్ని పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉందో చెప్పాలని డీఈఓను అడుగగా సమాధానం చెప్పక పోవడంపై అగ్రహం వ్యక్తం చేశారు. నిరంతర పర్యవేక్షణ జరగాలని ప్రతి రోజు డిఆర్డీఓ సిబ్బంది టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్స్, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మరుగుదొడ్ల నిర్మాణానికి మంగళవారం వరకు డిజైన్లు అందచేయాలని పంచాయతీరాజ్ ఈఈకి సూచించారు. పాఠశాలలలో మరుగుదొడ్లు ఎన్ని నిర్మించాల్సి ఉందో నివేదికలు అందచేయాలని డీఈఓను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ నరేష్, డీఈఓ రామ్ కుమార్, పీఆర్ ఈఈ దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి: ఎస్పీ కిరణ్ ఖరే

నవతెలంగాణ-భూపాలపల్లి

ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీసు అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేసి బాధితులకు అండగా ఉంటూ, ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో భాగంగా వివిధ మండలాల నుంచి 13 మంది ఫిర్యాదు చేయగా స్వీకరించి సంబంధిత అధికారులు సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. సివిల్ వివాదాలను కోర్టులోనే పరిష్కరించుకోవాలని సూచించారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తూ శాంతి భద్రతల పరిస్థితులకు భంగం కలిగించేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

హోటళ్లపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దాడులు

నవతెలంగాణ-మంగపేట

మండలంలోని కమలాపురం గ్రామంలోని హొటల్లు, రెస్టారెంట్లపై సోమవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులు జరిపారు. కమలాపురం హెచ్‌పి పెట్రోల్ బంక్ పక్కనగల గణేష్ దాబా, శ్రీరామ ఫ్యామిలీ రెస్టారెంట్ల పై దాడులు జరిపి ఆహార నమూనాలను సేకరించినట్లు రోహిత్ రెడ్డి తెలిపారు. అలాగే టిఫిన్ సెంటర్లను, హొటల్లను పరిశీలించి ఆహార భద్రతలు పరిశుభ్రత పాటించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా హొటల్లను, దాబాలను నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక లారీలను గ్రామస్థుల అడ్డగింత

నవతెలంగాణ-మంగపేట

ఇసుక క్వారీలో తమకు పనులు కల్పించాలని కోరుతూ లారీలను అడ్డుకున్న సంఘటన సోమవారం మండలంలోని మల్లూరు గ్రామంలో చోటు చేసుకుంది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మోట్లగూడెంలో గల ఇసుక క్వారి నుంచి గుత్తేదారులు సోమవారం ఇసుక తరలింపు చేపట్టారు. కాగా సొసైటీ సభ్యులు, గుత్తేదారులు ఇసుక క్వారీలో తమకు పనులు కల్పించడం లేదని గ్రామానికి చెందిన గిరిజనేతరులు ఏకమై క్వారీ నుంచి ఇసుక లారీలు బయటకు పోకుండా రోడ్డుకు అడ్డంగా నిల్చుని లారీలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో గ్రామస్థులకు ఇసుక క్వారీ సొసైటీ సభ్యులకు మధ్య వాగ్వివాదం జరిగింది. గోదావరి నది అందరి సొత్తని అందులో పనిచేసే హక్కు అం దరికీ కల్పించాలని మల్లూరు గ్రామస్థులు డిమాండ్ చేశారు.





అవగాహన కలిగి ఉండాలి : అదనపు కలెక్టర్

నవతెలంగాణ-భూపాలపల్లి

అసిస్టెంట్ సెక్షన్ అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం స్థానిక ఐడీఓసీ కార్యాలయపు సమావేశపు హాలులో ఐదు రోజుల పాటు జిల్లా పర్యటనకు విచ్చేసిన 27మంది అసిస్టెంట్ సెక్షన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ప్రజల జీవన విధానంపై చిట్టచివరి ఇంటిని కూడా పరిశీలించి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సిబ్బంది విధులు ఇలా అన్ని రకాల అంశాలపై శాఖల వారీగా అవగాహన కల్పించుకోవాలని తెలిపారు. గ్రామ స్థాయి పర్యటన భవిష్యత్ ఉద్యోగ జీవితానికి ఎంతో ఉపయోగపడుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉత్తర రాష్ట్రాలకు తెలంగాణ రాష్ట్రానికి చాలా వ్యత్యాసం ఉంటుందని, గ్రామీణ ప్రాంతాలు అత్యధికంగా కలిగిన రాష్ట్రం కాబట్టి ప్రజల జీవన విధానం పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ నెల 20వ తేదీ నుండి 24వ తేది వరకు కేంద్ర ప్రభుత్వ అసిస్టెంట్ సెక్షన్ అధికారుల బృందం జిల్లాలో పర్యటిస్తుందని అన్నారు. 27 మంది అధికారులు 5 రోజుల పాటు గన్ పూర్ మండలంలోని చెల్పూర్, రేగొండ మండలంలోని కొడవటంచ, కాటారం మండలంలోని గంగారం, మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం, భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు గ్రామాల్లో బృందం పర్యటించనుందని తెలిపారు. అదే గ్రామాల్లో అధికారులు బస చేయాల్సి ఉంటుందని సౌకర్యాలు కల్పనలో ఎలాంటి లోటు పాట్లు రాకుండా ఏర్పాట్లు చేయాలని ఎంపిడిఓలను ఆదేశించారు. భౌగోళిక, సామాజిక, ఆర్థిక స్థితిగతులు, ప్రజల జీవన విధానం, పంటలు, ఎస్సి, ఎస్టీ ఆవాసాలు వారి జీవన ప్రమాణాలు తదితర అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని అన్నారు. ఆయా గ్రామాల్లో అధికారులు పరిశీలించే అంశాలపై ఎంపిడిఓలు కార్యాచరణ ప్రణాళికను అందచేయాలన్నారు. డాక్టర్ మర్రిచెన్నారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ట్రైనింగ్ మేనేజర్ కుమార స్వామి, సీపీఓ శామ్యూల్, డీఆర్డీఓ నరేష్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

ప్రజావాణి కార్యక్రమంలో సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు అందచేసిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలకు సంబంధించిన 15 దరఖాస్తులను స్వీకరించారు. ఆయా దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖలకుకు ఎండార్స్మెంట్ చేశామన్నారు. శాఖల వారిగా పెండింగ్ సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్

నవతెలంగాణ-భూపాలపల్లి

ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్న అధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ రియాజ్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... తీన్మార్ మల్లన్న ప్రశ్నించే గొంతుక ప్రజా సమస్యల గురించి తెలిసిన వ్యక్తిగా ప్రజల కొరకు నిరంతరం ప్రశ్నించే గొంతుకగ ఎమ్మెల్సీగా గెలిపించే బాధ్యతను భుజాన వేసుకోవాలన్నారు. గత ప్రభుత్వం, పాలకుల అవినీతిపై ప్రశ్నిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రజలను చైతన్య పరచాలని గుర్తు చేశారు. ఆయనపై ఎన్నో కేసులు పెట్టి జైలుకు పంపిన నిరంతరం ప్రజా శ్రేయస్సుకే పని చేశాడని గుర్తు చేశారు. పట్టబద్దులందరూ తీన్మార్ మల్లన్నను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఇంచార్జ్ మార్క విజయ్ కుమార్, పిసిసి సభ్యుడు చల్లూరి మధు, పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, వర్కింగ్ ప్రెసిడెంట్ పీప్పాల రాజేందర్, ఎస్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్నాకర్, కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, పిల్లలమర్రి శారద నారాయణ, చల్ల రేణుక, సీనియర్ నాయకులు కేతరాజు సాంబమూర్తి, పైడిపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.



పకడ్బందీగా నిర్వహించాలి : అదనపు కలెక్టర్



నవతెలంగాణ - ములుగు

ఈ నెల 24 తేదీ నుండి 31 తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి శ్రీజ అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో సంబంధిత విభాగాల అధికారులతో సమావేశమై అదనపు కలెక్టర్ మాట్లాడారు. పరీక్ష కేంద్రాలకు నిరంత ర విద్యుత్ సరఫరా, ప్రతిరోజు తాగునీరు అందించేందుకు, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి వైద్య సౌకర్యాలు కల్పించాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలు చేరుకునేలా బస్సులు ఏర్పాటు చేయాలని టీఎస్ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. ములుగు జిల్లాలో 782 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం, 255 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. జిల్లాలో 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్మెంటల్ అధికారిని నియమించామన్నారు. మాల్ ప్రాక్టీస్ ను అరికట్టేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం, ఇద్దరు సభ్యులతో కూడిన సిట్టింగ్ స్క్వాడ్ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలో 144 సెక్షన్ అమలు ఉంటుందని తెలిపారు. డీఎంహెచ్ఓ అల్లె అప్పయ్య, సీఐ మేకల రంజిత్, డీపీఆర్ఓ ఎండి రఫీక్, పోస్టల్ అసిస్టెంట్ ఎండీ షారుక్ సోహెల్, టీఎస్ ఎన్పీడీసీఎల్ ఏఈ వెంకట్ రెడ్డి, ఎల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో డబ్బులు చెల్లించాలి

ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లించే విధంగా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి శ్రీజ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డీఆర్డీఏ శ్రీనివాస్‌కుమార్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించి అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఉపాధి హామీ పనిలో కూలీల సంఖ్య పెంచే విధంగా చూడాలని, దినసరి వేతనం రూ.250 కల్పించేలా చూడాలని అన్నారు. పెండింగ్ బిల్లులన్నీ చెల్లించాలని, అర్హతలు ఉన్న వారందరికీ పనులు కల్పించాలని తెలిపారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతంలో కూలీలకు తాగునీరు, ఎండ వేడిమి తగలకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఏపీడీ వెంకట నారాయణ , ఎంపీడీవోలు, ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వాటిని త్వరితగతిన పరిష్కారించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి శ్రీజ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలు రెవెన్యూశాఖకు సంబంధించినవి 9, ఉద్యోగాలకు సంబంధించినవి 6, పెండింగ్ బిల్లులకు సంబంధించినవి 5 మొత్తం 20 దరఖాస్తులను ఆర్డీవో సత్యపాల్ రెడ్డితో కలిసి స్వీకరించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. డీఆర్డీఓ శ్రీనివాస్‌కుమార్, డీఎంహెచ్ఓ అప్పయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడి తుల రవి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయ చంద్ర, డీడబ్ల్యూఓ స్వర్ణలత లేనినా, ఎల్‌డి ఎం రాజ్‌కుమార్, సంక్షేమ శాఖ అధికారి ప్రేమలత, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హక్కులను ఉపయోగించుకోవాలి

చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్

నవతెలంగాణ - ములుగు

ఉచిత న్యాయం, కార్మికులచట్టం వారికీ ఉన్న హక్కులు ఉపయోగించుకోవాలనీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ తెలిపారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ములుగు జిల్లా గవర్నమెంట్ మెడికల్ కాలేజీ ఆవరణలో సోమవారం భవన నిర్మాణా కార్మికులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మహేందర్ పాల్గొని మాట్లాడుతూ... ఉచిత న్యాయం, కార్మికులచట్టం వారికీ ఉన్న హక్కులు, పోక్సో చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్సె కౌన్సిల్ రాచర్ల రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఇంటర్మీడియట్ అడ్మిషన్స్ ప్రారంభం

కస్తూర్బాగాంధీ పాఠశాల స్పెషల్ అధికారి వెన్నెల

నవతెలంగాణ-మల్హర్‌రావు



మల్హర్‌రావు మండలంలోని దుబ్బపేట గ్రామపరిధి కస్తూర్బా గాంధీ ఆశ్రమ ప్రభుత్వ బాలికల విద్యాలయంలోని ఇంటర్మీడియట్ కళాశాలలో సిఈసి, ఎంపీహెచ్ డబ్ల్యూ తదితర కోర్సులకు అడ్మిషన్స్ ప్రారంభమైనట్లు పాఠశాల స్పెషల్ అధికారి వెన్నెల తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని 10వ తరగతి పూర్తి చేసిన బాలికలు ఇంటర్మీడియట్ సిఈసి, ఎంపీహెచ్ డబ్ల్యూ కోర్సుల్లో చేరడానికి ఆసక్తి ఉన్నవారు సంప్రదించాలని కోరారు. బాలికలకు హాస్టల్ వసతితో పాటు, అనుభవజ్ఞులైన అధ్యాపకనియలచే నాణ్యత బోధన, డిజిటల్ క్లాసురూమ్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రవేశాల కోసం 6281389147లో సంప్రదించాలని కోరారు.

అదనపు కలెక్టర్ శ్రీజకు ఆహ్వాన పత్రిక అందజేత

నాంచారమ్మ జాతర ఆలయ కమిటీ చైర్మన్ లోకిని రాజు

నవతెలంగాణ - ములుగు



ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామంజపూర్ గ్రామంలోని పంటపొలాల మధ్య ఉన్న నాంచారమ్మ జాతర మే 23న జరిగే మహా జాతర కార్యక్రమానికి ములుగు జిల్లా అదనపు కలెక్టర్‌కు ఆలయ కమిటీ చైర్మన్ లోకిని రాజు సోమవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా లోకిని రాజు మాట్లాడుతూ నాలుగు రాష్ట్రాల నుండి ఎరకల నాంచారమ్మ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాంచారమ్మ డైరెక్టర్లు కేతిరి బిక్షపతి, పల్లగొండ భాస్కర్, మానుపాటి రమేష్ ,దాసరి గంగయ్య మేడారం ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్ ముంజాల బిక్షపతి ,చిర్రా గణేష్, దేవర్ల కృష్ణ తదితరులు ఉన్నారు.

దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలి

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతి

నవతెలంగాణ-భూపాలపల్లి

అకాల వర్షం కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. సోమవారం హైదరాబాదు సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల క్రితం కురిసిన అకాల వర్షం కారణంగా భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలో దెబ్బతిన్న వరి



పంటలకు నష్టపరిహారం అందించి నియోజకవర్గ రైతులను ఆదుకోవాలన్నారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని కోరారు ఆయన వెంట మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



కీర్తి భాయి మృతి పార్టీకి తీరని లోటు

శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ శ్రీనుబాబు

నవతెలంగాణ-మల్హర్‌రావు/మహాదేవపూర్

మహాముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ మహిళ అధ్యక్షురాలు, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు జాడి కీర్తి భాయి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. సోమవారం ఆమె దశదిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ శ్రీనుబాబు పాల్గొని బాధితురాలు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో కీర్తిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడారు. కీర్తిబాయి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని అన్నారు. పార్టీ కోసం ఎనలేని కృషి చేసిందని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ ఒక మంచి నాయకురాలిని కోల్పోయిందని భావోవగ్వాదేహానికి గురైయ్యారు. ఆయన వెంట జెడ్పీటీసీ లింగంపల్లి శారద దుర్గయ్య, మండల అధ్యక్షుడు సడలయ్య, మాజీ జెడ్పీటీసీ సమ్మయ్య, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.



మారుమూల ప్రాంతాల ఉద్యోగులకు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలి

పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాచర్ల శ్రీనివాస్, పసుల శంకర్

నవతెలంగాణ-మహదేవపూర్

మారుమూల ప్రాంతాల ఉద్యోగులకు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని పీఆర్‌టీయూ భూపాలపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాచర్ల శ్రీనివాస్, పసుల శంకర్ కోరారు. రెండవ వేతన సవరణ కమిషన్(పిఆర్‌సి) చైర్మన్ ఎన్ శివ శంకర్ బృందాన్ని సోమవారం వారు కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. భూపాలపల్లి జిల్లాలోని మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో గల మారుమూల ప్రాంతాలు పలిమెల, మహా ముత్తారం, మహాదేవపూర్ మండలాల పరిధిలో పనిచేసే ఉద్యోగ ఉపాధ్యాయులకు రోడ్డు రవాణా, వైద్య సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు. ఏజెన్సీ కానీ ఈ ప్రాంతాల ఉద్యోగ ఉపాధ్యాయులకు ఏజెన్సీ భత్యం ఇవ్వాలని కోరారు. భూపాలపల్లి బొగ్గు బావులు, జెన్కో లాంటి పారిశ్రామిక పొల్యూటెడ్ ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగ ఉపాధ్యాయులకు బ్యాడ్ క్లైమేట్ అలవెన్స్(బిసిఎ) ప్రకటించాలని కోరారు. నివేదికల పేరిట కాలయాపన చేయకుండా సత్వరమే మెరుగైన పిఆర్సీని 1 జూలై 2023 నుండి అమలుపరిచేలా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కోరారు.

'తడిసిన ధాన్యంను కొనుగోలు చేయాలి'

నవతెలంగాణ - ములుగు

తడిసి ముద్దయిన ప్రతి ఒక్క వడ్ల గింజలు కొనుగోలు చేయాలనీ,తరుగు లేకుండా ప్రతి క్వింటాకు 500 రూపాయలు బోనస్‌గా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలనీ ఎస్టి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్ తెలిపారు. బీజేపీ ములుగు జిల్లా కార్యాలయంలో సోమవారం ముఖ్య సమావేశం ఏర్పాటు చేసి సురేందర్ మాట్లాడారు. వారం రోజుల నుండి ములుగు జిల్లా వ్యాప్తంగా అకాల వర్షాలతో పంట నష్టం అయినా ప్రతి రైతును ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వడ్ల కొనుగోలు కేంద్రాలలో వడ్లు తడవకుండా టార్పాలిన్లు అందజేయాలని డిమాండ్ చేశారు. ఫసల్ బీమా యోజన ద్వారా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కోడ్ అనంతరం అమలు చేయాలని అన్నారు తరుగు తాళి పేరుతో ప్రతి రైతు దగ్గర 5 నుండి 10 కిలోల వరకు మధ్యలో ఉన్న మధ్యవర్తులు మిల్లర్లు తీస్తున్నారని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు దాటినా కూడా నేటికీ రైతు భరోసా లేదని అన్నారు. రైతులకు రుణమాఫీ చేయకుంటే ధర్నాలు చేస్తామన్నారు.

మహదేవపూర్ :కాటారం మండల కేంద్రంలో ధన్వాడ గ్రామం, దేవరాంపల్లి, శంకరాంపల్లి గ్రామాల్లో భారీ వర్షాల కారణంగా తడిచిన కొనుగోలు కేంద్రాలు, వడ్ల కల్లాలను సోమవారం బీజేపీ రాష్ట్ర నాయకులు చల్లా నారాయణ రెడ్డి సందర్శించారు. అనంతరం భూపాలపల్లి అడిషనల్ కలెక్టర్, డీసీఓ, సంబంధిత అధికారులకు ఫోన్ చేసి రైతుల బాధలను వివరించారు. వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి, తడిచిన వడ్లను తరుగు తీయకుండా కొనుగోలు చేయాలనీ కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవట్లేదన్నారు. రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. బీజేపీ కాటారం మండల అధ్యక్షులు బండం మల్లా రెడ్డి, మాజీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి,స్వామి యాదవ్,పాగే రంజిత్, దుర్గం తిరుపతి,గోగుల రాజేష్,రాజు, కొండా రాము బీజేపీ నాయకులు ఉన్నారు.

శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ శీను బాబు పరామర్శ

నవతెలంగాణ-మహాదేవపూర్

మహా ముత్తారం మండలంలోని మహాముత్తారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగమల్ల రాజయ్య తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం బాధిత కుటుంబ సభ్యులనుశ్రీపాద ట్రస్ట్ చైర్మన్ శీను బాబు పరామర్శించారు. బోర్లగూడెంలో జంగిడి రాజేందర్ అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఇదే గ్రామంలో మహాముత్తారం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జాడి కీర్తి రోడ్డు ప్రమాదంలో చనిపోగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మహాముత్తారం, కాటారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి : టీఎస్‌యూఎస్

నవతెలంగాణ -కోల్‌బెల్ట్

సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామెర గట్టయ్య, ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి ఆధ్వర్యంలో హైదరాబాదులోని సింగరేణి భవన్ లో సోమవారం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. రాష్ట్రంలో ఉన్న బొగ్గు బ్లాక్ లు ప్రైవేట్ పరం కాకుండా మనకే దక్కేలా చూడాలని అన్నారు. ప్రభుత్వ విద్యుత్ సంస్థల నుండి సింగరేణికి రావాల్సిన బకాయిలు 25 వేల కోట్ల రూపాయలు వసూలు చేయాలని కోరారు. సింగరేణిలో భూగర్భ గనులను ప్రోత్సహించే ఓపెన్ కాస్టను రద్దు చేయాలని అన్నారు. సింగరేణి లాభాలలో 45శాతం వాటాను కార్మికులకు ఇవ్వాలని, సొంతింటి పథకం కింద కార్మికులకు 300 గజాల స్థలం, 20 లక్షల రూపాయల వడ్డీ లేని రుణం ఇవ్వాలని, ఇన్కమ్ టాక్స్ రద్దు చేయాలని, అసంఘటిత కార్మికులకు 10 లక్షల రూపాయల హెల్త్ కార్డు ఇవ్వాలని, వారిని పర్మినెంట్ చేయాలని కోరారు. వారు ప్రమాదవశాత్తు మరణిస్తే 50 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా చెల్లించాలని, సింగరేణి కార్మికులకు ప్రత్యేకించి హైదరాబాదులో ఆర్టీసీ తరహాలో ఒక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్నికలలో విధులు నిర్వహించిన సింగరేణి ఉద్యోగులకు ఓడిలతో కూడిన వేతనం చెల్లించాలన్నారు. డిస్మిస్ కార్మికులను విధుల్లో కి తీసుకోవడానికి అవకాశం కల్పించాలని అన్నారు. రిటైర్మెంట్ కార్మికులకు ఐదు సంవత్సరాలకు ఒకసారి పెన్షన్ 15 శాతం పెంచాలని, వారికి హెల్త్ కార్డును 10 లక్షలు 20 లక్షల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల డిపెండెంట్ లపై ఉన్న విజిలెన్స్ కేసులను ఎత్తివేసి వాళ్లకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్, టీఎస్ యుఎస్ లీగల్ అడ్వైజర్ రత్నం కిరణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవి సత్యం, రాష్ట్ర నాయకులు వెంగళ కనకయ్య, జైపాల్ సింగ్, వెంకటేష్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలి

సొసైటీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్ల శంకర్

నవతెలంగాణ-మల్హర్‌రావు

ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదువుతూ శాస్త్రవేత్తగా, ఒక అంబేద్కర్‌గా ఎదగాలని ఆల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ సొసైటీ రిజిస్ట్రేషన్ నెంబర్-542 రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు లింగమల్ల శంకర్ ఆకాం క్షించారు. ఏవైయూ కాళేశ్వరం జోనల్ అధ్యక్షుడు చింతల కుమార్ యాదవ్, ఉపాధ్యక్షుడు బండి సుధాకర్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కొయ్యూర్ కమ్యూనిటీ హాల్లో 10వ తరగతి, ఇంటర్మీడియట్ లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి,తమ ప్రతిభను చాటిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా సొసైటీ జాతీయ అధ్యక్షురాలు వేముల జ్యోతి, కార్యవర్గ సభ్యుడు బండి రాజయ్య హాజరై మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదువుతూ ఉన్నత శిఖరాలను అవరోధించాలన్నారు. ఈ సందర్భంగా 10వ తరగతి, ఇంటర్మీడియట్ లో రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన చింతల తేజోరాం,రామిడి చాందిని, బిర్నేని స్ఫూర్తి, పల్లెర్ల అమూల్య, తాండ్ర నక్షత్ర,సాగర్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలేసి నివాళులర్పించారు. రమాబాయి అంబెద్కర్ జీవిత చరిత్ర గ్రంథాలను, గోల్డ్ మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అనుబంధ సంఘాల నాయకులు రావుల మొగిలి,కొండ రాజమ్మ, కొండ్ర సారయ్య, కేశారపు సురేందర్, కొండూరి మమత,రణధీర్ రావు, రాజ్ కుమార్, రాకెష్, రాజమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా గరుడ దివాసం

నవతెలంగాణ-మంగపేట

మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన సోమవారం నాడు గరుడ దివాసం కార్యక్రమాన్ని భద్రాచలం నుంచి వచ్చిన అమరవాది కష్ణమాచార్యుల బందం పూజారులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని ఉత్సవమూర్తులను చింతామణి జలాలతో, పాలతో అభిషేకించి పూలమాలలతో అలంకరించారు. ఈ పూజ కార్యక్రమాలను తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడం విశేషం. బ్రహ్మోత్సవాల సందర్భంగా ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రానికి చెందిన వైద్యులు పిఎంకె గాంధీ నిర్మలమ్మ దంపతులు సుమారు 560 గ్రాముల బరువు, సుమారు 60 వేల రూపాయల విలువ చేసే వెండి కిరీటాన్ని సోమవారం స్వామి వారికి బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి కిరీటాన్ని స్వామివారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాజశేఖర్ శర్మ రాఘవాచారి, వెంకట నారాయణ శర్మ, పవన్ కుమారాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు

బీసీ డిక్లరేషన్ వచ్చేదాకా పోరాట చేయాలి

తెలంగాణ బీసీ ప్రజా సంఘం

నవతెలంగాణ-మల్హర్‌రావు

బిసి డిక్లరేషన్ ప్రకటన వచ్చేదాకా పోరాటం చేయాలని తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్ పిలుపునిచ్చారు.మండల కేంద్రంలో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్, రాష్ట్ర కన్వీనర్ బండారి దేవేందర్ హాజరై మాట్లాడారు. తెలంగాణ బీసీ ప్రజా సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని ఎడ్లపల్లి గ్రామానికి చెందిన అక్కినవేని సుమన్ ముదిరాజ్‌ను నియమించినట్లు తెలిపారు. జిల్లా బీసీ డిక్లరేషన్ వచ్చే వరకు నిరంతర పోరాటం చేయాలని పిలుపునిస్తూ నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ ప్రజా సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా యూత్ అధ్యక్షుడు ఆవునురి సతీష్, ఉమ్మడి జిల్లా నాయకులు బెజ్జాల కోటి, చీదర్ల రవి, బత్తిని వెంకటేష్, భూపాలపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు బొజ్జం ప్రవీణ్ పాల్గొన్నారు.



తీన్మార్ మల్లన్న ను భారీ మెజార్టీ తో గెలిపించాలి

తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్

నవతెలంగాణ - ములుగు

ఉమ్మడి వరంగల్, ఖమ్మం నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ను భారీ మెజార్టీ తో గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎండి రియాజ్ తెలిపారు. ములుగు జిల్లా కేంద్రములో గ్రంథాలయానికి విచ్చేసి పట్టభద్రులను సోమవారం కలిసి రియాజ్ మాట్లాడారు. రాష్ట్రంలో పేదల పక్షాన,నిరుద్యోగుల కోసం నిలబడి కొట్లాడిన మల్లన్నను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, మండల అధ్యక్షులు ఎండి చాంద్ పాషా, ములుగు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింత నిప్పుల బిక్షపతి, ఎస్సీ సెల్ ములుగు మండల అధ్యక్షులు మట్టెవాడ తిరుపతి, యూత్ కాంగ్రెస్ ములుగు మండల అధ్యక్షులు కుక్కల నాగరాజు, అధ్యక్షులు యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి నేపాల్ రావు, పత్తిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు సారయ్య, పట్టభద్రులు బల్గూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



స్వార్థపూరిత రాజకీయ పార్టీలకు గుణపాఠం చెప్పాలి

స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి తాడిశెట్టి క్రాంతి కుమార్

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

స్వార్థపూరిత రాజకీయ పార్టీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని వరంగల్, ఖమ్మం, నల్గొండ పార్లమెంటు స్వతంత్ర అభ్యర్థి తాడిశెట్టి క్రాంతి కుమార్ అన్నారు.సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కేంద్రంలో 10 సంవత్సరాల కాలం అధికారంలో ఉన్న బిజెపి పార్టీ తెలంగాణకు ఎలాంటి సహాయ సహకారాలు అందించలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం నీళ్ల నిధులు నియామకాల నినాదంతో రాష్ట్రం ఏర్పడితే కెసిఆర్ కుటుంబమే బాగుపడిందని ఆరోపించారు. కాంగ్రెస్, బిజెపి పార్టీ నుండి పోటీ చేస్తున్న అభ్యర్థులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ ఫిరాయింపులు పాల్పడుతూ ప్రజా శ్రేయస్సు కొరకు ఏనాడు పాటుపడని విమర్శించారు. బి ఆర్ ఎస్ పార్టీ పై దాడి చేసి మళ్లీ అదే పార్టీ నుండి పోటీ చేస్తున్న రాకేష్ రెడ్డి, బిజెపి అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డి నల్గొండ వరంగల్ ఖమ్మం ప్రాంత అభివృద్ధికి కృషి చేయలేదని ఆరోపించారు. వారి స్వలాభం కోసం పార్టీలు మారుతూ ఆస్తులను కాపాడుకోవడానికి చీకటి దందాలను కొనసాగించడానికి పనిచేస్తున్నారని విమర్శించారు. తాను విద్యార్థి దశ నుండి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించానని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.



తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు

నవతెలంగాణ-గణపురం

మండలంలోని ధర్మరావుపేట గ్రామంలోని శివాలయం ఎల్లమ్మ గుడిలో సోమవారం నుండి శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానములు ఆధ్వర్యంలో హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఐదు రోజుల ధార్మిక కార్యక్రమంలో భాగంగా భజన కార్యక్రమాలు ఆకుల సుభాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలు అందించిన ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్ రామిరెడ్డి కృష్ణమూర్తికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్నా సాంబయ్య, దూలం శంకర్, ఆకుల దామోదర్, పూజారి కుమారస్వామి,బెనికి రాజు, గాజ రమేష్, కేశెట్టి ఆదిరెడ్డి, రౌతు ఓదెలు,సింగం రాజవీరు, పాలకుర్తి సాంబయ్య, పనికెల శివ కష్ణ, రత్నం మొగిలి పనికెల వసంత, చిన్నపాక రమ, కళాకారులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను రిటర్నుల్లో అవకతవకలను సరిచేయాలి

సింగరేణి యాజమాన్యం నోటీసు

నవతెలంగాణ -కోల్‌బెల్ట్


2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆదాయపన్ను రిటర్న్(ఐటీ)లో కన్సల్టెంట్ల ప్రలోభాలకు లోనై కొంతమంది సింగరేణి ఉద్యోగులు, అధికారులు తప్పుడు పత్రాలు సమర్పించినట్లు, అధిక మినహాయింపులు పొందినట్లు తమ దృష్టికి వచ్చిందని ఆదాయ పన్ను శాఖ అధికారులు సింగరేణి సంస్థకు తెలిపారని, ఉద్యోగులకు సింగరేణి యాజమాన్యం సోమవారం నోటీసు జారీ చేసింది. తప్పుడు పత్రాలు సమర్పించిన ఉద్యోగులు తప్పులు సరి చేసుకోవడానికి, సరైన క్లెయిమ్స్ ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్‌కు సమర్పించడానికి ఆదాయపన్ను శాఖ అవకాశాన్ని కల్పించిందని, వినియోగించుకొని తప్పులు సరి చేసుకోవాలన్నారు. లేదంటే ఆదాయ పన్ను శాఖ అధికారులు చేసే దర్యాప్తులో నిజమని తేలితే రిఫండ్ పొందిన అదనపు పన్నుపై వడ్డీని, అదనపు పన్నుపై 200 శాతం జరిమానా, తప్పుడు కేసుగా పరిగణిస్తూ జైలు శిక్ష కూడా విధించవచ్చని ఆ హెచ్చరించింది. భవిష్యత్తులో ఇటువంటి తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపింది. మరిన్ని వివరాలకు www. incometaxindia.gov.in వెబ్ సైట్ కానీ, 1800-103-0025/1800-419-0025 హెల్ప్ లైన్ నెంబర్లను సంప్రదించాలని యాజమాన్యం సూచించింది.

ఈనెల 24న పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష

ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొప్పుల మల్లేశం

నవతెలంగాణ - ములుగు

ఈనెల 24వ తేదీ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా డిప్లమా కోర్సులలో ప్రవేశానికి పాలిసెట్- 2024 ఎంట్రన్స్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు పాలిసెట్ - 2024 ములుగు జిల్లా కోఆర్డినేటర్ - స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ములుగు ప్రిన్సిపల్ డాక్టర్ కొప్పుల మల్లేశం పేర్కొన్నారు. జిల్లాలో రెండు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ములుగుఋఎ ఒక సెంటర్, టీఎస్ మోడల్ స్కూల్, బండారుపల్లిఋఎ మరో సెంటర్ ఈ రెండు



సెంటర్లలో ఇప్పటివరకు 675 మంది విద్యార్థులను కేటాయించినట్లు చెప్పారు. 24న ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30గంటల వరకు పరీక్ష ఉంటుందని అన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఈ పరీక్షకు నిర్ణీత సమయం కంటే ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించరని అన్నారు. అదే విధంగా పరీక్ష పూర్తయ్యే వరకు పరీక్ష హాలును విడిచి వెళ్ళరాదన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఇటీవల డౌన్లోడ్ చేసుకున్న హాల్ టికెట్ తో మాత్రమే హాజరు కావాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు వారి వెంట హెచ్బి పెన్సిల్, పెన్ను, ఎరేజర్, షార్పెనర్ వంటివి మాత్రమే తీసుకు రావాల్సి ఉంటుందన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ ఏటూరునాగారం ఐటిడిఏ

బెస్ట్ అవలెబుల్ స్కీం అడ్మిషన్లకు గాను 2024-25 విద్యాసంవత్సరంలో గిరిజన విద్యార్థులకు ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3, 5, 8 తరగతి విద్యార్థులకు గాను 32 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఎస్టీకి 29 సీట్లు కాగా, షెడ్యూల్ కులాల వారికి 3 సీట్లను కేటాయించినట్లు తెలిపారు. ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో ఈనెల 21 నుంచి జూన్ 6 వరకు సాయంత్రం ఐదు గంటలలోపు దరఖాస్తులను కార్యాలయంలో అందించాలన్నారు. రూరల్ గిరిజన కుటుంబాలకు వార్షిక ఆదాయం రూ. 1.50లక్షలు, అర్బన్ వారికి రూ. 2 లక్షల ఆదాయం ఉండా లన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి డ్రా పద్ధతిలో సీట్లను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఒక్కో కుటుంబం నుంచి ఒక్కరు మాత్రమే ఈ పథకానికి అర్హులన్నారు. దత్తత తీసుకున్న పిల్లలకు ఈ పథకం వర్తించదన్నారు. దరఖాస్తులతో పాటు కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలతోపాటు విద్యార్థికి చెందిన బోనోఫైడ్, ఆధార్, పుట్టిన తేదీ, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను అందజేయాలన్నారు.